www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
06-08-2024
సంపుటి : 01 | సంచిక : 94 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# తెలంగాణకు రండి.. పెట్టుబడి పెట్టండి

## అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోండి



అమెరికాకు మీరే ఆయువుపట్టు

న్యూజెర్సీలో ప్రవాసుల ఆత్మీయ సమ్మేళనం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

### హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ కొత్త సెంటర్

10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్

దాదాపు 15 వేల మంది యువతకు ఉద్యోగాలు

అమెరికాలో సీఎంతో చర్చలు జరిపిన కంపెనీ ప్రతినిధి బృందం

2

# అట్టుడుకుతున్న బంగ్లాదేశ్

ఘర్షణల్లో 100మందికి పైగా మృతి

షేక్ హసీనా రాజీనామా

దేశం విడిచి వెళ్లిన ప్రధాని

భారత్- బంగ్లా సరిహద్దులో బీఎస్‌ఎఫ్ హైఅలర్ట్






**ఢాకా:** బంగ్లాదేశ్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలతో దేశం అట్టుడుకుతోంది. ఆదివారం ఘర్షణల్లో 100 మందికి పైగా మృతి చెందగా.. ఇప్పటివరకు మొత్తం 300 మంది చనిపోవడంతో ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ముందుజాగ్రత్త చర్యగా ఢాకా ప్యాలెస్ ను వీడిన ప్రధానమంత్రి షేక్ హసీనా.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు. ఆందోళనలు ఉద్ధృతం కావడంతో మిగతా2లో...

# తెలంగాణ స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర

- వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- త్వరలోనే బాధ్యతల స్వీకరణ
- ఏడాదికి లక్షమందికి శిక్షణ ఇచ్చేలా వర్సిటీ విస్తరణ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక 'తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ'కి చైర్మన్‌గా ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ అధినేత పద్మభూషణ్ ఆనంద్ మహీంద్ర వ్యవహరిస్తారని మిగతా2లో...



2

## కోచింగ్ సెంటర్లా.. డెత్ చాంబర్లా

ఢిల్లీ ఘటనపై సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

అధికారుల తీరుపై ఆగ్రహం

విద్యార్థుల జీవితాలలో ఆడుకుంటున్నారు..

కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలను నోటీసులు జారీ

## తెలంగాణలో ఉపఎన్నికలు తప్పవు

పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో బీఆర్ఎస్ న్యాయపోరాటం

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయిస్తాం: కేటీఆర్



2

## ప్రొ. జయశంకర్ అడుగుజాడల్లోనే రాష్ట్ర సాధన

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



2






## తెలంగాణ స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర

**(మొదటి పేజీ తరువాయి)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఆదివారం న్యూజెర్సీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తెలంగాణ స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించడానికి ఆనంద్ మహీంద్ర అంగీకరించారని, కొద్ది రోజుల్లోనే వారు బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు.తెలంగాణ యువతను ప్రపంచంలోనే ఉత్తమ నైపుణ్యం కలిగినవారిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటైన తెలంగాణ స్కిల్ యూనివర్సిటీకి అంతర్జాతీయంగా పేరున్న ప్రముఖుడినే అధినేతగా నియమిస్తామని ముఖ్యమంత్రి ఇటీవల అసెంబ్లీలోనూ ప్రకటించారు. ఆనంద్ మహీంద్రా గారు ఇటీవల హైదరాబాద్ లో ముఖ్యమంత్రి గారితో సమావేశమైన సందర్భంలోనూ తెలంగాణ స్కిల్ యూనివర్సిటీపై చర్చలు జరిపారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల కేంద్రంగా అభివృద్ధి కానున్న ఫ్యూచర్ సిటీ పరిధిలో బ్యాగరికంచె వద్ద తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ భవనానికి ముఖ్యమంత్రి గతవారం శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీలో 17 రకాల కోర్సుల్లో ఏటా 20వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికేట్ ఇవ్వడంతోపాటు ఆయా కంపెనీల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించే ఏర్పాటు చేశారు. రాబోయే సంవత్సరాల్లో ఏడాదికి లక్ష మందికి శిక్షణ ఇచ్చేలా స్కిల్ వర్సిటీని విస్తరించనున్నారు. బ్యాగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా భవంతి నుంచి స్కిల్ యూనివర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

## తెలంగాణలో ఉపఎన్నికలు తప్పవు

**ఢిల్లీ:** తెలంగాణలో ఉపఎన్నికలు తప్పవని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయిస్తామని హెచ్చరించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు .. న్యాయకోవిదులతో చర్చలు జరిపారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో బీఆర్ఎస్ న్యాయపోరాటం చేస్తుందన్నారు. రాజ్యాంగ నిపుణులతో పార్టీ సీనియర్ ప్రతినిధుల బృందం సమావేశమవుతుందని, బీఆర్ఎస్ తరపున త్వరలోనే సుప్రీం కోర్టులో కేసు వేస్తామని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామన్నారు.

**దళిత మహిళపై ఇంత దాష్టీకమా?..**
షాద్నగర్లో దళిత మహిళపై పోలీసుల దాడిని కేటీఆర్ ఖండిరచారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత మహిళపై ఇంత దాష్టీకమా? అని మండిపడ్డారు. 'ఇదేనా ఇందిరమ్మ పాలన? ఇదేనా ప్రజాపాలన? దొంగతనం ఒప్పుకోవాలంటూ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా?' అని ప్రశ్నించారు. రక్షించాల్సిన పోలీసుల దగ్గరే రక్షణలేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. దాడికి పాల్పడిన పోలీసులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు నమోదు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత మహిళకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కోచింగ్ సెంటర్లా.. డెత్ చాంబర్లా..



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఓ కోచింగ్ సెంటర్ బేస్మెంట్లోకి వరద పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన సంచలనంగా మారింది.ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది.దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన న్యాయస్థానం.. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.కోచింగ్ సెంటర్లను నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడిరది. ''ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ఢిల్లీకి వచ్చిన విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. నగరంలోని కోచింగ్ సెంటర్లు డెత్ ఛాంబర్ లుగా మారాయి. వాటిని సక్రమంగా నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఈ ఘటన అందరి కళ్లు తెరిపించింది'' అంటూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్లతో కూడిన ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇనిస్టిట్యూట్లో భద్రతా ప్రమాణాలు అందించే వరకూ ఆన్లైన్లో తరగతులు నిర్వహించుకోవచ్చని సూచించింది.కోచింగ్ సెంటర్లను ఎలాంటి నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారో న్యాయస్థానానికి వివరించాలంటూ కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కాగా.. సెంట్రల్ ఢిల్లీలోనిఓల్డ్ రాజేంద్రనగర్ లోని ఐఏఎస్ స్టడీ సెంటర్ లోకి వరదనీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి.నగరంలో విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అధికారుల తీరును ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఉచితాలను ప్రోత్సహిస్తూ.. పన్నులు వసూలు చేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతించి డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే ఇలాంటి అనర్థాలకు దారితీస్తుందని పేర్కొంది. ఈ కేసును సీబీఐకి బదిలీ చేసింది. ఈ క్రమంలోనే ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది.

# తెలంగాణకు రండి.. పెట్టుబడి పెట్టండి

**విశ్వంభర, హైదరాబాద్:**
రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు. న్యూజెర్సీలో ఆదివారం జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళానికి వేలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా దారిపొడవునా భారీ ర్యాలీతో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుంది. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్ గా లభిస్తుంది..' అని ఎన్నారైలలో ఉత్సాహం నింపారు. "గత సంవత్సరం టీపీసీసీ అధ్యక్షుని హోదాలోఅమెరికాకు వచ్చాను. పదేండ్ల పాటు సాగిన దుష్పరిపాలనకు, విధ్వంసాలకు విముక్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మళ్లీ వస్తానని చెప్పాను. నేను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను" అన్నారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఇప్పటికే రైతులు, మహిళలు, యువకుల సంక్షేమం, అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీతో పాటు, ఇన్ పుట్ సబ్సిడీగా రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, విద్యార్థులకు నాణ్యమైన విద్య పథకాలను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ప్రారంభం మాత్రమే అని.. భవిష్యత్తు ప్రణాళికలతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. తమ పరిపాలనపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు తావు లేదని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమ్మిళిత ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించే తమ ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకు వస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిధుల సమీకరణతో పాటు ఎక్కువ మందికి ఉపాధి కల్పన, నైపుణ్యాల వృద్ధికి అందులో సమానమైన ప్రాధాన్యమిస్తామని చెప్పారు. 'ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగింది.. గిట్టని వాళ్లందరూ అసలు కాంగ్రెస్ అధికారంలోకి రాదని అన్నారు. వచ్చినా అది ఉండనే ఉండదన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తుందంటూ లేని పోని అపోహలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వాళ్లకు తగిన బుద్ధి చెప్పాం. అబద్ధాలకోరుల మాటలు తప్పని మరోసారి నిరూపిస్తాం. హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేసేందుకు పోటీ పడతాం...' అని సీఎం ప్రకటించారు. మీ నైపుణ్యాలు, మీ ప్రతిభా పాటవాలతో అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చారని ప్రవాసులను ముఖ్యమంత్రి అభినందించారు. ఇకపై తెలంగాణకు మీ సేవలు అందించాలని స్వాగతించారు. తెలంగాణలో మెట్రో కోర్ అర్బన్ తో పాటు , సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా అమెరికాలోని ఈస్ట్ కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన




పలువురు ముఖ్యులతో సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి మాస్టర్ ప్లాన్ తో హైదరాబాద్ ను అత్యున్నత స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు మీరందరూ కలిసి రావాలని ప్రవాసులకు సీఎం పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న కృషిని ఎన్నారైలు అభినందించారు. హైదరాబాద్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను, భవిష్యత్తు ప్రణాళికలను అందరూ ప్రశంసించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనే ప్రచారంలో ప్రభుత్వంతో కలిసి పాల్గొంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే పాటలు, నృత్యాలతో కూడిన భారీ ప్రదర్శనను చిన్నారులు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్జియాన్ మాట్లాడుతూ.. 'మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలన్న మా కోరిక నెరవేరింది. ఇప్పుడు రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేయడానికి మనమందరం కష్టపడాలి...' అన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, వ్యాక్సిన్‌లు, హెల్త్‌కేర్, అర్టిఫిషియల్ రంగాల్లో తెలంగాణ బలమైన స్థావరంగా ఎదగాలని ఆకాంక్షించారు.

# అట్టుడుకుతున్న బంగ్లాదేశ్

**(మొదటి పేజీ తరువాయి)**
పీఎం పదవికి రాజీనామా చేయడంతోపాటు దేశం విడిచి వెళ్లారు. ఈ విషయాన్ని సైన్యం ధ్రువీకరించింది. దేశంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న తరుణంలో ప్రధాని హసీనా, ఆమె సోదరి రెహానాలు రాజధాని ఢాకా నుంచి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు. ఆర్మీకి చెందిన ప్రత్యేక హెలికాప్టర్లో దేశం విడిచి వెళ్లిపోయినట్లు తెలిసింది. అయితే, వాళ్లు ఎక్కడికి వెళ్లారనే విషయంపై స్పష్టత లేదు. భారత్ వెళ్లి ఉండొచ్చని పలు మీడియా సంస్థలు చెబుతుండగా.. మరికొన్ని మాత్రం వేరే దేశం వెళ్లనున్నట్లు పేర్కొంటున్నాయి. మరోవైపు ప్రధానమంత్రి అధికారిక నివాసమైన గణబాబన్ను ముట్టడించిన వేలాది మంది ఆందోళనకారులు.. అక్కడ విధ్వంసం సృష్టించారు.

**రంగంలోకి ఆర్మీ!**
హింసాత్మక ఘటనలతో దేశం అట్టుడుకుతోన్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఇప్పటికే కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సామాజిక మాధ్యమాలపైనా ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్మీ రంగంలోకి దిగింది. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వాకర్-ఉజ్-జమాన్ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ.. నిరసనకారులు హింసామార్గాన్ని వీడాలని పిలుపునిచ్చారు. హింసాత్మక ఘటన నేపథ్యంలో త్వరలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**భారత్- బంగ్లా సరిహద్దులో బీఎస్ఎఫ్ హైఅలర్ట్**
ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటా అంశం బంగ్లాదేశ్ లో తీవ్ర ఉద్రికత్తలకు కారణమైంది.



దేశాన్ని అగ్ని గుండంలా మార్చింది. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. పొరుగు దేశంలో ఉద్రికత్తల నేపథ్యంలో భారత సైన్యం అప్రమత్తమైంది. భారత్- బంగ్లా సరిహద్దులో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ హైఅలర్ట్ ప్రకటించింది. 4, 096 కిలోమీటర్ల మేర ఉన్న భారత్- బంగ్లా సరిహద్దులో అదనపు బలగాలను వెంటనే మోహరించాలని ఆదేశించింది. కమాండర్లందరూ సరిహద్దులోనే ఉండాలని సూచించినట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు. బంగ్లాదేశ్లో హింసాత్మక, రాజకీయ పరిణామాల దృష్ట్యా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్రికత్తలు పెరగడంతో సరిహద్దులో ఉన్న బీఎస్ఎఫ్ సిబ్బందికి సెలవులను కూడా రద్దు చేశారు. ఎటువంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయి. తతతాజా పరిస్థితులను సమీక్షించేందుకు ఇప్పటికే బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరి కోల్కతా చేరుకున్నట్లు తెలుస్తోంది. కాగా.. రిజర్వేషన్లను తొలగించి ప్రతిభకు పట్టం కట్టాలని చేస్తున్న ఆందోళనలు తారా స్థాయికి చేరుకున్నాయి. హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడంతో ముందుజాగ్రత్త చర్యగా ఢాకా ప్యాలెస్ను వీడిన ప్రధానమంత్రి షేక్ హసీనా.. సురక్షిత ప్రాంతానికి తరలివెళ్లారు. ఈ క్రమంలోనే సైన్యం రంగంలోకి దిగింది. త్వరలో తాత్కాలిక ప్రభుత్వ బంగ్లాలో కర్ఫ్యూ కొనసాగుతోంది. ఇంటర్నెట్ సామాజిక మాధ్యమాలపైన ఆంక్షలు విధించారు. పరిస్థితిని కంట్రోల్లోకి తెచ్చేందుకు ఆర్మీ తీవ్రంగా యత్నిస్తోంది. ప్రస్తుత పరిస్థితిని అసాంఘిక శక్తులు ఆసరాగా చేసుకునే అవకాశాలున్న నేపథ్యంలో భారత దళాలు సరిహద్దు వెంబడి భద్రతను మరింత కట్టుదిట్టం చేశాయి.

## హైదరాబాద్ లో కాగ్నిజెంట్ కొత్త సెంటర్

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రపంచ స్థాయిలో ఐటి రంగంలో పేరొందిన కాగ్నిజెంట్ కంపెనీ తెలంగాణలో భారీ విస్తరణ ప్రణాళికకు ముందుకు వచ్చింది. హైదరాబాద్ లో దాదాపు 15 వేల మంది ఉద్యోగులకు పని కల్పించేలా కొత్త సెంటర్ నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. పది లక్షల చదరపు అడుగుల స్థలంలో ఈ కేంద్రాన్ని స్థాపించనుంది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబులు కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్, కంపెనీ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో ఈ ఒప్పందం జరిగింది. గత ఏడాది ముఖ్యమంత్రి బృందం దావోస్ పర్యటన సందర్భంగానే ఈ ఒప్పందానికి పునాదులు పడ్డాయి. సాంకేతికత, కొత్త ఆవిష్కరణలకు అభివృద్ధి కేంద్రంగా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందుకే కాగ్నిజెంట్ కంపెనీ హైదరాబాద్ లో తమ కంపెనీ విస్తరణకు మొగ్గు చూపింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా సత్తా చాటుకుంటున్న హైదరాబాద్ లో తమ కంపెనీ విస్తరించటం సంతోషంగా ఉందని కాగ్నిజెంట్ సీఈవో ఎస్.రవికుమార్ అన్నారు. హైదరాబాద్ లో నెలకొల్పే కొత్త సెంటర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ క్లయింట్లకు మెరుగైన సేవలందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఐటీ సేవలతో పాటు కన్సల్టింగ్ లో అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది. ఐటి రంగానికి మరింత అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు. కాగ్నిజెంట్ కంపెనీ కొత్త సెంటర్ ఏర్పాటుతో ప్రపంచ టెక్నాలజీ కంపెనీలన్నీ హైదరాబాద్ ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయని అభిప్రాయపడ్డారు. కాగ్నిజెంట్ కంపెనీకి తమ ప్రభుత్వం తగినంత మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కొత్త సెంటర్ ఏర్పాటుతో వేలాది మంది యువతకు ఉద్యోగాలతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు.
హైదరాబాద్ తో పాటు తెలంగాణలోని ఇతర టైర్-2 నగరాలలో కూడా ఐటీ సేవలను విస్తరించాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు కంపెనీ ప్రతినిధులు సానుకూలత వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రముఖ టెక్ కంపెనీలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నాయని, ఇక్కడ కొత్త కేంద్రాన్నిస్థాపించాలనే కాగ్నిజెంట్ నిర్ణయం హైదరాబాద్ వృద్ధికి దోహదపడుతుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు.

## కేటీపీఎస్‌లో 8 కూలింగ్ టవర్ల కూల్చివేత

**పాల్వంచ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ లో ఓ అండ్ ఎం కర్మాగారం కూలింగ్ టవర్ల చారిత్రక ప్రస్థానం ముగిసింది. 8 కూలింగ్ టవర్లను అధికారులు కూల్చివేశారు. కాలం చెల్లడంతో 2020 ఏప్రిల్ 11న కర్మాగారం మూతపడింది. కూలింగ్ టవర్లు ఉన్న ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో వాటిని కూల్చివేయాలని కేటీపీఎస్ నిర్ణయించింది. ఈ క్రమంలో 2023 జనవరి 18 నుంచి పాత కర్మాగారానికి సంబంధించిన టవర్ల కూల్చివేత పనులు మొదలయ్యాయి. రాజస్థాన్లోని జైపూర్ కు చెందిన ఓ ప్రైవేటు సంస్థ ఈ ప్రక్రియను చేపట్టింది. ట్రాన్స్కోతో పాటు జిల్లా కలెక్టర్ అనుమతులు పొందిన అనంతరం కూల్చివేత చేపట్టారు. 30 మంది సిబ్బంది సుమారు నెలరోజుల పాటు సన్నాహాలు చేశారు. మొత్తం మూడు దశల్లో కూల్చివేత కొనసాగింది. తొలుత 'ఏ' స్టేషన్లోని 102 మీటర్ల ఎత్తు కలిగిన నాలుగు కూలింగ్ టవర్లు కూల్చివేశారు. ఆ తర్వాత 115 మీటర్ల ఎత్తుగల నాలుగు టవర్లను రెండు దశల్లో నేలమట్టం చేశారు. ఇంప్లోషిన్ అనే పేలుడు పదార్థాన్ని



దీనికోసం వినియోగించారు. కూల్చిన కూలింగ్ టవర్ల ప్రాంతాన్ని శుభ్రం చేయనున్నారు. అనంతరం ఆ ప్రదేశం కేటీపీఎస్ కు ఉపయోగపడనుంది.

## ప్రొ. జయశంకర్ అడుగు జాడల్లోనే రాష్ట్ర సాధన



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ స్వరాష్ట్ర స్వాప్నికుడు, సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని, వారు తెలంగాణ కోసం చేసిన కృషిని, త్యాగాన్ని , తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు.తొలిదశ నుంచి మలి దశ ఉద్యమం దాకా తెలంగాణ సాధన దిశగా వారు చేసిన భావజాల వ్యాప్తి, దశాబ్దాలపాటు సాగిన ఉద్యమంలో వారు అందించిన అచంచల పోరాట స్ఫూర్తి అజరామరమైనవని కేసీఆర్ కొనియాడారు.వారి అడుగుజాడల్లో తాను మలిదశ తెలంగాణ ఉద్యమానికి సారథ్యం వహించి, చివరి దాకా శాంతియుత పద్ధతిలో, పార్లమెంటరీ పంథాలో ప్రజా ఉద్యమాన్ని కొనసాగించి, అరవై ఏళ్ల స్వయంపాలన ఆకాంక్షను నిజం చేసుకున్నామని కేసీఆర్ అన్నారు. రాష్ట్ర సాధన అనంతరం ప్రజల మద్దతుతో స్వరాష్ట్రంలో ప్రారంభమైన మొట్టమొదటి ప్రభుత్వాన్ని ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోనే కొనసాగించామని తెలిపారు. ఉద్యమాన్ని నడిపి గమ్యాన్ని చేరుకోవడంలోనూ., తదనంతరం పదేళ్ల అనతికాలంలోనే దేశానికే ఆదర్శవంతమైన పాలన అందించడంలోనూ వారి స్ఫూర్తి ఇమిడి ఉందని కేసీఆర్ తెలిపారు. స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాలను, సకలజనులను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపిన బీఆర్ఎస్ పాలన అందించిన స్ఫూర్తిని కొనసాగిస్తూ, తెలంగాణను మరింతగా ప్రగతి పథంలో నడిపేలా కృషి చేయడమే వారికందించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

# కరవు తీరేలా కృష్ణమ్మ పరవళ్లు

**విశ్వంభర, నాగార్జునసాగర్:**
శ్రీశైలం నుంచి వరద ప్రవాహం పోటెత్తడంతో నిండుకుండలా మారిన నాగార్జునసాగర్ డ్యామ్ గేట్లను సోమవారం ఎత్తారు. అధికారులు తొలుత ఉదయం ఆరు గేట్లను ఎత్తారు. క్రమక్రమంగా గేట్ల సంఖ్యను పెంచుతూ వెళ్లారు. సాయంత్రం అయ్యేసరికి మొత్తం 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో గతేడాది వెలవెలబోయిన నాగార్జునసాగర్ ఈసారి నీటితో కళకళలాడుతోంది. ముందుగా నాగార్జునసాగర్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, సీఈ అనిల్ కుమార్ కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి, ఆరు రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. అనంతరం మరో పది గేట్లను క్రమక్రమంగా ఎత్తారు. అంతకుముందు దిగువ ప్రాంతాల ప్రజల అప్రమత్తత కోసం సైరన్‌ను మోగించారు. శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు రావడంతో సోమవారం గేట్లు ఎత్తామని ఎస్‌ఈ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సుమారు లక్ష నుంచి 2 లక్షలకు పైగా క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వరద నీటి ప్రవాహం ఆధారంగా మరిన్ని గేట్లు తెరుస్తామన్నారు. కాగా సాగర్ గేట్లు ఎత్తడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. పెద్దఎత్తున వచ్చి గేట్ల నుంచి వస్తున్న నీటి ప్రవాహాన్ని తిలకిస్తున్నారు.

**పోటెత్తుతున్న వరద**
ప్రస్తుతం నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం



ప్రాజెక్టు నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఇన్ ఫ్లో 3,23,331 క్యూసెక్కులు ఉండగా, 1,63,220 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. సాగర్ పూ ర్తిస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు ఉండగా, ప్రస్తుత నీటి మట్టం 584 అడుగులకు చేరింది. 312.50 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి ప్రస్తుత నీటి నిల్వ 294.55 టీఎంసీలు ఉంది. మొత్తం పదహారు గేట్లు ఎత్తి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు.

**కృష్ణమ్మ కళకళ**
ఈ ఏడాది కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు అంతంత మాత్రంగా నే ప్రవాహం రాగా, కృష్ణానది పరిధిలోని ప్రాజెక్టులు నిండుకుండల్లాగా మారాయి. గత సంవత్సరం ప్రవాహం లేక వెలవెలబోయిన కృష్ణమ్మ ప్రాజెక్టులన్నీ నేడు నీటితో కళకళలాడుతున్నాయి. ఎగువన కర్ణాటక లో కురుస్తున్న భారీ వర్షాలతో పెద్దఎత్తున వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయానికి సుంకేశుల, జూరాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో 10 గేట్లను ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగర్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

## సెప్టెంబరులో జమ్మూ కశ్మీర్

# అసెంబ్లీకి ఎన్నికలు

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- జమ్ములో ఏకాత్మ మహోత్సవ్‌లో పాల్గొన్న కేంద్రమంత్రి
- ఆర్టికల్ 370 రద్దయి ఐదేళ్లయిన సందర్భంగా సభ



**జమ్ము:** జమ్మూ కశ్మీర్‌లో సెప్టెంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. అభివృద్ధి పనులు వేగంగా సాగేందుకు, ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఐదేళ్ల కిందట ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వం లోని ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసిందన్నారు. దాంతో జమ్మూ కశ్మీర్‌లో పాక్, గూఢచార సంస్థ, ఐఎస్ఐ కార్యకలాపాలు చాలా వరకు అరికట్టగలిగామని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ అధిష్ఠానం నియమించిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదో వార్షికోత్సవం సందర్భంగా జమ్మూలోని బానా సింగ్ స్టేడియంలో పార్టీ నిర్వహించిన 'ఏకాత్మ మహోత్సవ్' పాల్గొని, ఆయన ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తూ.. సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆర్టికల్ 370ని రద్దు చేసి, బీజేపీని పొడిగిస్తూ వచ్చిన మార్పులను చూసి ప్రజలు బీజేపీని పూర్తి మెజారిటీతో అధికారంలోకి తీసుకువస్తారనే నమ్మకం ఉందన్నారు.

### ఆర్టికల్ 370 రద్దు.. కాంగ్రెస్‌కు బ్లాక్ డేనా?

జమ్మూకశ్మీర్ అభివృద్ధికి అడ్డుగా ఉండి, అక్కడి ప్రజల స్వేచ్ఛకు సంకెళ్లుగా మారిన ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని జమ్మూకశ్మీర్ సహా యావద్భారతం స్వాగతిస్తే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం 'బ్లాక్ డే' గా చెప్పుకోవడం అత్యంత దురదృష్టకరమని కేంద్రమంత్రి, జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇంఛార్జి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా.. ఈ చారిత్రక ఘట్టాన్ని కాంగ్రెస్ పార్టీ 'బ్లాక్ డే'గా పరిగణించడంపై కిషన్ రెడ్డి మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2019 వరకు కశ్మీర్ లో అశాంతికి, అభివృద్ధి జరగకపో వడానికి కాంగ్రెస్సే కారణమని.. అలాంటి పార్టీ ఇవాళ జమ్మూకశ్మీర్ అభివృద్ధి చూసి జీర్ణించుకోలేక పోతోందన్నా రు. జమ్మూ కశ్మీర్ కు స్వతంత్రత కల్పించే విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా వ్యతిరేకించేలా కాంగ్రెస్ పార్టీ మాట్లాడటం.. న్యాయస్థా నాలను అగౌరవప రచడమేనన్నారు. ఆగస్టు 5ను బ్లాక్ డేగా పరిగణించాలన్న కాంగ్రెస్ ఆవేదన యావద్భారతానికి చాలా చక్కగా అర్థమైందన్నారు. కాంగ్రెస్ పార్టీపై కిషన్ రెడ్డి కింది ప్రశ్నలను సంధించారు.

- వెనుకబాటునుంచి, కుటుంబ రాజకీయాలనుంచి జమ్మూకశ్మీర్ కు స్వతంత్రత కల్పించినందుకు బ్లాక్‌డేనా..?
- ఏళ్లుగా.. రిజర్వేషన్‌కు దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు వాళ్ల హక్కులు లభించినందుకా?
- ప్రజల హక్కులను కాలరాసిన, వివక్షపూరితంగా ఉ న్నటువంటి.. 890 కేంద్ర చట్టాలను, 205 రాష్ట్ర చట్టాలను తొలగించినందుకా?
- 73వ సవరణ ప్రకారం 27 హక్కులను స్థానికసంస్థలకు ఇవ్వడం, పంచాయతీలకు సరైనన్ని నిధులిచ్చి రోడ్లు, విద్య, వైద్యంపై ఖర్చు చేసినందుకా?
- దశాబ్దాలుగా వివక్షకు గురైన పశ్చిమ పాకిస్తానీ శరణార్థులు, వాల్మీకీలు, గోరా[illegible]లు, సఫాయి కర్మచారుల వంటి 60 లక్షల మందికి డొమిసైల్ సర్టిఫికెట్లు ఇచ్చినందుకా?
- రూ. 58,477 కోట్ల ప్రధానమంత్రి అభివృద్ధి ప్యాకేజీలో భాగంగా.. 53 కీలకమైన ప్రాజెక్టులు పూర్తిచేసినందుకా?
- పర్యాటక రంగానికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తూ.. పర్యాటకంపై ఆధారపడి జీవిస్తున్న సగటు ముస్లిం కుటుంబంలో వెలుగులు విరజిమ్ముతున్నందుకా?
- యువతకు తగినన్ని విద్యావకాశాలు కల్పిస్తూ, నైపుణ్యతను అందిస్తూ.. కొత్తగా 16,650 ఉ ద్యోగావకాశాలు కల్పించినందుకా?

అన్ని రకాలుగా జమ్మూకశ్మీర్ అభివృద్ధిలో సమూలమైన మార్పులు వచ్చి ప్రజలు స్వచ్ఛందంగా ప్రజాస్వామ్య పరిరక్షణలో పాల్గొనటాన్ని చూసి జీర్ణించుకోలేక కళ్లు మూసుకున్న కాంగ్రెస్ పార్టీకి చీకటి కనిపించడం సహజమే. అందుకే వారు చరిత్రాత్మకమైన రోజును ఉ త్సవంగా కాకుండా.. చీకటి రోజుగా జరుపుకొంటు న్నారన్నారు. ఇలాంటి కాంగ్రెస్ పార్టీని దేవుడు కూడా కాపాడలేడని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# దుర్గమ్మ భక్తులకుఆ రోజు ఉచిత సేవ

**విశ్వంభర, విజయవాడ :** విజయవాడ ఇంద్రకీలా ద్రిపై కొలువైన ఉన్న దుర్గమ్మ ఆలయంలో.. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఈనెల 23న సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని (ఆర్జిత, ఉచిత) నిర్వహిస్తున్నారు. దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈనెల 5 నుంచి సెప్టెంబరు 2 వరకు పలు ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్లు ఈవో రామారావు ఒక ప్రకటనలో తెలియజే శారు. ఈనెల 16న దుర్గమ్మను వరలక్ష్మీ దేవిగా అమ్మవారిని అలంకరిస్తారన్న విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు. విజయవాడ ఆలయంలో ఈనెల 18 నుంచి 20 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు.. ఈ సందర్భంగా ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17 (శనివారం)న సాయంత్రం 4 గంటలకు ఉదక శాంతిని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారని ఈవో రామారావు చెప్పారు. 18 (ఆదివారం)న వేకువ జామున 3 గంటలకు సుప్రభాత సేవ, స్నపనా భిషేకం అనంతరం మూలవిరాట్‌తో పాటు ఉ పాలయాల్లోని విగ్రహాలకు పవిత్ర ధారణ చేస్తారని భక్తులు గమనించాలన్నారు. అదే రోజు ఉదయం



9 గంటలకు క్యూలైన్లో వేచి ఉన్న భక్తులను దర్శనానికి అనుమతిస్తారని తెలిపారు. ఈ నెల 19 (సోమవారం)న మూలమంత్ర హవనాలు, వేద పారాయణ నిర్వహిస్తారన్నారు. 20 (మంగళవారం)న ఉదయం 8 నుంచి 10గంటల వరకు మండపారాధన, సర్వప్రాయశ్చిత్త శాంతిపౌష్టిక హోమాలను నిర్వహిస్తారని ఈవో అన్నారు. అదే రోజు ఉదయం 10.30గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయన్నారు. విజయవాడ ఇంద్రకీల్రాదిపై దుర్గమ్మ సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే భక్తులు దరఖాస్తులు ఇవ్వాలని ఈవో ఆదేశించారు. ఈనెల 17 నుంచి 21 వరకు పూర్తి చేసిన దరఖాస్తులను ఆలయలో అందజేయాలని భక్తులకు సూచించారు. ఒకవేళ ఆలయంలో ఆర్జిత వరలక్ష్మీ వ్రతం కావాలంటే.. ఒక్కో టికెట్ రూ.1500గా నిర్ణయించినట్లు తెలియజేశఆరు. ఈ నెల 23న ఉదయం 7 నుం చి 9 గంటల వరకు ఆర్జిత వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వ హిస్తారన్నారు. ఉదయం 10 నుంచి 11.30 గం టల వరకు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తారని తెలిపారు. దుర్గమ్మ భక్తులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.




## లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా చూడాలి



**విశ్వంభర, వనస్థలిపురం :** ఆటోనగర్ ఇసుక లారీల యాజమానుల సంఘం నిర్వహించబోయే ఎన్నికల కొరకు లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా చూడాలని లారీ యూనియన్ యాజమానుల సంఘం మాజీ అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్, సీనియర్ నాయకులు బచ్చనబోయిన జగదీష్ యాదవ్ ఆధ్వర్యంలో వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఎస్సై ని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సుర్వి రాజు గౌడ్, జగదీశ్ యాదవ్ మాట్లాడుతూ.. ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం ఎన్నికలని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎలాంటి గొడవలకు తావు లేకుండా అందరం కలిసి కట్టుగా ముందుకు సాగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్ కురుమ, కొండే శ్రీశైలం, మహేష్ యాదవ్, సుర్వి రవి గౌడ్, యాజమానుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్.బి.నగర్‌లో అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు పాలాభిషేకం

### ఎస్సీలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**విశ్వంభర, ఎల్.బి.నగర్:** ఎస్.సి.వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన నేపథ్యంలో సోమవారం ఎల్.బి.నగర్ కూడలిలోని అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భం గా ఎస్సీ విభాగం నాయకులు స్వీట్లు పంచి, డప్పు చప్పుళ్ల తో సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ మాదిగ ఉపకులాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు స ముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరారపు జలంధర్, తూర్పాటి చిరంజీవి, అడాల రమేష్, మల్లెపాక యాదగిరి, కొంగర మహేష్, రుద్రాల స్వామి, సుదర్శన్, కొత్తపేట్ ప్రభాకర్, ఏర్పుల గాలయ్య, బాలాజీ, జోగు నగేష్, ఇటుకల యాదగిరి, బోయ అంజయ్య, కె. బిక్షపతి, జలంధర్, నిర్మల, విజయలక్ష్మి అనిత ఎల్బీనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ విభాగం నాయకులు,



ఎమ్మార్పీఎస్ దళిత సంఘాల నాయకులు, మహిళలు అధి క సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు.



# తెలంగాణ ప్రజల దిక్సూచి ఆచార్య జయశంకర్

**తెలంగాణ రాష్ట్రం కోసం అనునిత్యం పరితపించి తెలంగాణకీ జరుగుతున్న అన్యాయాన్ని వెలుగెత్తి చాటి మలి దశ ఉద్యమానికి సిద్ధాంత కర్త గా నిలిచి , తెలంగాణ రాష్ట్రానికి దిక్సూచిల నిరంతరం తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం తన సర్వస్వాన్ని ధారపోసిన మహోన్నతుడు ప్రొ.జయశంకర్ సార్. తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారు.. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన నిరంతర కృషిని, ఆయన ధృడ సంకల్పాన్ని తెలంగాణ రాష్ట్రం ఎప్పటికీ మరచిపోదు. మంగళవారం ప్రొ.జయశంకర్ సార్ 90వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.**



1934, ఆగస్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట లో జయశంకర్ జన్మించారు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత రావు. ఆయనకు ముగ్గురు అన్న దమ్ములు, ముగ్గురు అక్క చెల్లెళ్లు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించు కోకుండా, తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి, ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలి పోయారు.

బెనారస్, అలీగఢ్ విశ్వ విద్యాలయాల నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్ డీ చేశారు. 1975 నుంచి 1979 వరకు వరంగల్ లోని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేశారు. 1979 నుంచి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్ 1991 నుంచి 1994 వరకు ఆదే యూనివర్శిటీకి ఉప కులపతిగా పని చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1952 లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకునిగా 1954 లో ఫజల్ అలీ కమిషన్ కు నివేదిక ఇచ్చారు. కె.సి.ఆర్ కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశారు. తెలంగాణ లోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశారు. జయశంకర్ తన ఆ ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారు. "అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్నా బెర్ మర్దనా" (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి. తర్వాత మరణించాలి అని అనేవారు. తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా విదేశాల్లో సైతం వ్యాప్తి చేయడంలో ఆయన పాత్ర మరవ లేనిది. ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు. 1952 నాన్ ముల్కీ, ఉద్యమం లోకి ఉరికి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించాడు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన అపర మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి, ఆచరించిన మహనీయులు. తెలంగాణ డిమాండ్ ను 1969 నుంచి నిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసిన మేధావి ఆయన. తెలంగాణ లోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట గళాన్ని అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద , విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినింపించిన పోరాట యోధులు.

"మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాకుకావాలి..!! యాభై ఏళ్లుగా ఇదే ఆకాంక్ష.. ఇదే శ్వాస.. ఇదే లక్ష్యం... ఇదే జీవితం.. ఇందులోనే మరణం!" అని ఉద్యమాన్ని శ్వాసించిన మహోపాధ్యాయుడు ప్రొఫెసర్ కొత్త పల్లి జయశంకర్, రెండేళ్లు గొంతు క్యాన్సర్ తో బాధపడ్డారు. మీరు చేయాల్సింది మీరు చేశారు. ఈ సమయంలో నేను ఇక్కడ ఇక ఉండలేను. నేను వరంగల్ కు పోతాను.. నన్ను పంపండి' అంటూ ఆయన పుట్టిన గడ్డమీద మమకారంతో వరంగల్ వచ్చారు. ఇంట్లోనే వైద్యులు ఆయనకు అన్నిరకాల వైద్యసేవలు అందించారు. 2011 జూన్ 6 మంగళవారం రోజున తెల్లవారు జాము నుంచి ఆయన పల్స్ రేట్ పడిపోవడంతో ఆక్సిజన్ అందించారు. చివరకు అదేరోజు ఉదయం 11.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు.

అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్ గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే, జిల్లాలో "విప్లవ విద్యార్థి ఉద్యమానికి" కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమర్జెన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి, ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తు పెట్టుకోవడం సర్వసాధారణమే కానీ, ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని, పేరు పెట్టి పిలవడం, ఒక్క జయశంకర్ సార్ కు సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితివేత్త రామశాస్త్రి చెప్పేవారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశ విదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ప్రొఫెసర్ కే. సీతా రామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్.



# కట్టెమ్మటి బడి

కట్టెమ్మటిబడి కావాలని కోరుకున్న
అలలను పిల్లలను ఇష్టపడి, నేనూ
పిల్లలు అలలుకావాలని కలగన్నా
ఎందుకంటే అలసిపోకుండా పడిలేచేది అలే కదా!
వారానికిగాని తెలిసింది.....
కట్టిప్పుడు మిట్టమధ్యాహ్నం గువ్వలజంటకు వెన్నెల గూడైంది.
గుడిసెలో ఆల్ట్రాటెక్ బెంచీలమీద వాలి అలలను ముద్దాడుతున్నాయి.
అప్పుడప్పుడూ ఆకాశంలోకి గుండ్రంగా రింగులు రింగులుగా
మబ్బువలయాలను మత్తుగా వదులుతుంటాయి.
అలంకార్ థియేటర్ లో కరెంటుపోయి వచ్చి నప్పుడు
రహస్యాల గుట్టు రట్టైనట్టు ఇంటర్వెల్ లో కట్టకు
పొయ్యొచ్చినప్పుడల్లా కిలకిలా నవ్వుకుంటున్నాయి
పిల్ల పక్షులు. పొద్దున్నే వసతి వనం నుండి
బండెడు బరువును రెక్కలు కట్టుకొని
సందులగుండా సాగిపోతున్న పూలరెక్కలపై
వాలడానికి మున్సిపల్ కమీషనర్ ఇంటి మూలమలుపు మీది
సిరికాంచెట్టుమీద పసిడి పరిమళంకోసం
సిగ్గు లేకుండా నగ్నంగా నాట్యం చేస్తున్న గండుతమ్మెదల్లా
మూలమూలనా మలుపు మలుపునా
పేవ్ మెంట్లమీదా మొఖంమీద నీళ్ళుచల్లుకోకుండానే
చూపుల ముళ్ళతో సిద్ధంగా ఉన్నాయి
జులాయి తుమ్మెదలు. సాయంత్రానికి,
పాతబస్టాండ్ దగ్గర నర్సయ్య పండ్ల కొట్టు పక్కన
పందులు సగం తిని మూతితో అటూ ఇటూ
రాకి పారేసిన తర్వాత ఎండకు ఎండి ఆరిపోయిన
మామిడి టెంకెమీది పీచుతో ఒకడు గర్ల్స్ హై స్కూల్ వెనుక కట్టకింది చెట్టుకింద
కాపురముంటున్న పిట్టగూడుతో ఒకడూ
మోకాలి చిప్పలుకనపడేలా పిక్కలు దాటని ప్యాంటు
రొమ్ము పై రొండు గుండీల అంగీతో ఇంకొకడూ
అందంగా ముస్తాబై ముసురు కుంటున్నారు ఈగల్లా అని.
నిజమే నేను కన్న కలను నిజంచేయాలి
రేకులు రాలిపోకుండా రేపు వాలిపోకుండా
పిల్లలను నిలువెత్తు అలల్ని చేసి ఎగరేయాలి.

**- గొడితాల వెంకటేశ్వర్లు (జీవి)**
**+91 93989 51271**



# యుద్ధోన్మాదం ఎందుకు? శాంతితో సాగుదాం ముందుకు!

## హిరోషిమాపై బాంబు దాడికి నేటితో 79 ఏళ్లు

ప్రపంచ చరిత్రలో "సామ్రాజ్యవాదం" అంటే "యుద్ధం" అని రుజువైన సత్యం. యుద్ధం అంటే "మారణ హోమం" అని చెప్పటానికి మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధంతో పాటుగా 1945 ఆగస్టు 6న హీరోషిమా నగరంపై వేసిన బాంబులు, చేసిన యుద్ధం, జరిగిన మారణకాండ చెదిరిపోని చరిత్రగా ప్రపంచ ప్రజల కళ్ల ముందు ఒక దృశ్యంలా కదలాడుతుంటుంది. మొదటి ప్రపంచ యుద్ధం 1914 జూలై 28న ప్రారంభమై 1918 నవంబర్ 11న ముగిసింది. ఈ యుద్ధం సామ్రాజ్యవాద ఆక్రమిత, ఆధిపత్య, పెత్తందారీఆలోచనలకు ప్రతిరూపం అనేది సత్యం. ఈ యుద్ధంలో మిలియన్ల కొద్ది రష్యన్లు వీరోచితంగా పోరాడారు. ఫ్యాక్టరీలలో పని చేసే కార్మికులు, మహిళలు, వ్యవసాయ మహిళలు ఈ యుద్ధానికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చారు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకించాలని ప్రచారం చేశారు. మహిళలు పిడికిళ్ళు బిగించి యుద్ధం వద్దు, మాకు బ్రెడ్ & పీస్ కావాలని ఊరేగింపు చేశారు. యుద్ధానికి బలమైన మిలియన్ల ప్రజల రక్తం ఏరులై పారుతున్న దృశ్యాన్ని, నాగరికత, సాంస్కృతిక జీవితాలు, భవిష్యత్తు కుటుంబాలు చూసి దుఃఖించాయి. యుద్ధాలు లేని సమాజం గురించి ఆలోచించారు. ఆ క్రమంలోనే 1917 లో రష్యాలు అక్టోబర్ విప్లవం విజయవంతమైంది. ఆ సందర్భంగా సోషలిస్ట్ మహోద్యమ నాయకుడు లెనిన్ 1917 అక్టోబర్ 26న అఖిల రష్యా సోవియట్ల మహాసభలో విషయాలను స్పష్టంగా అవగాహన చేసుకున్నాడు. శాంతిని సాధించటం కోసం ప్రత్యక్ష చర్యలు చేపట్టటం మన మొట్టమొదటి కర్తవ్యమని చెప్పారు.

అటు తర్వాత యుద్ధాల నివారణకు అంతర్జాతీయంగా తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి నానాజాతి సమితి (League of Nations) ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంస్థ సమర్థవంతంగా పని చేయకపోవటం వలన 1945 అక్టోబరు 24 నుండి ఐక్యరాజ్యసమితి (UNO) అధికారికంగా అమలులోకి వచ్చింది.

ఈ ఐక్యరాజ్యసమితి ఏర్పాటుకు పరిస్థితులు వేరుగా ఉన్నవి. సెప్టెంబర్ 1వ తేదీ1939న పోలెండ్ పై హిట్లర్ దాడి చేయడంతో అన్ని దేశాలు ఆ యుద్ధంలో పాల్గొనటం, అది రెండో ప్రపంచయుద్ధంగా మారటం జరిగింది. సామ్రాజ్యవాద దేశాలు పసిఫిక్ మహా సముద్రంలోని దీవుల మీద ఆధిపత్యం కోసం, అక్కడ ఉన్న వనరులపై ఆధిపత్యం కోసం పోరాటాలు సాగించాయి. 1920 నుండి అమెరికాకు, జపాన్‌కు మధ్యన కూడా ఆధిపత్య పోరాటం కొనసాగుతూనే ఉంది . ఎప్పుడైతే అమెరికా, శాండియోగోలో ఉన్న తన "నావెల్ బేస్" ను ఉద్దేశ పూర్వకంగానే, జపాన్ కు దగ్గరలో నున్న "పెరల్ హార్బర్" కు మార్చిందో, జపాన్ పక్కలో బల్లెంగా దీన్ని భావించింది. ఏ క్షణంలోనైనా అమెరికా తనపై దాడి చేయవచ్చని భావించింది. 1941 డిసెంబర్ 7వ తేదిన, ముందుగానే, జపాన్ పెరల్ హార్బర్ లో ఉన్న "అమెరికా నావెల్ బేస్" మీద బాంబు దాడి చేసింది.

ఆ దాడిలో మూడు వేల మంది పౌరులు, సైన్యం, మృత్యువాత పడ్డారు. పెద్దఎత్తున ఆస్తినష్టం జరిగింది. ఈ దాడికి ప్రతి దాడి చేయాలని, ప్రపంచం మొత్తం తన బలాన్ని చూసి భయపడాలనుకున్న అమెరికా "రాబర్ ఓపెన్ హైమార్ "శాస్త్రవేత్త నేతృత్వంలో 1942 నుండి 1945 మధ్య కాలంలో 2.2 బిలియన్ డాలర్ లు ఖర్చు పెట్టి సుమారు "ఒక లక్షా ముప్పై వేల మంది" కార్మికులతో మూడేళ్లలో"ఆటంబాంబు"ను తయారు చేసింది. మరొకవైపు యునైటెడ్ స్టేట్స్ కూటమి దేశాలు, సామ్రాజ్యవాద జపనీస్ దేశ సైనికులను బేషరతుగా లొంగిపోవాలని 26 జూలై 1945న పోస్ట్ డామ్ డిక్లరేషన్ పిలుపునిచ్చింది. దాన్ని జపాన్ పట్టించుకోలేదు. అహం దెబ్బ తిన్న అమెరికా కూటమి దేశాలు అణుబాంబులు ప్రయోగించి దాడి చేయాలని నిర్ణయం తీసుకున్నాయి. అమెరికాకు కూడా తన బలాన్ని చూపే అవకాశం కల్గింది.

ఈ న్యూక్లియర్ బాంబును ముందుగా 1945 జూలై 16న న్యూ మెక్సికోలోని ఒక ఎడారిలో పరీక్షించింది. అటు తర్వాత జపాన్ సామ్రాజ్యవాద పెత్తనాన్ని అణచడానికి, తన పగ తీర్చుకోవడానికి గొప్ప పన్నాగం, వ్యూహ రచన చేసింది. జపాన్ ను ఆర్థికంగా, సైనికపరంగా దెబ్బతీయటానికి, నష్టం తీవ్ర రూపంలో ఉండాలని, జన సాంద్రత ఎక్కువ, మిలిటరీ స్థావరాలు, పోర్ట్స్, ఆయిల్ సెంటర్స్, ఇండస్ట్రీస్ ఉన్న ప్రాంతాలను టార్గెట్ చేస్తూ 1945 ఆగస్టు 6వ తేదిన, యురేనియంతో తయారు చేసిన Fatman అనే పేరుగల ఆటంబాంబును హిరోషీమాపై వేయటం జరిగింది. ఈ బాంబు ప్రమాదం వల్ల సుమారు 1,66,000 మంది మరణించారు. వేలమంది క్షతగాత్రులు అయ్యారు. కోట్లాది రూపాయల ఆస్థి నష్టం జరిగింది. ఈ బాంబు రేడియేషన్ ప్రభావం వలన లక్షలాది మంది ప్రజలకు చర్మ వ్యాధులు, క్యాన్సర్ వ్యాధులు సోకాయి.

"Fatman" (యురేనియం బాంబుతో) సంతృప్తి చెందని, యుద్ధ దాహార్తి తీరని, రక్తపు దాహం ఆరని అమెరికా ఆగష్టు 9న ప్లుటోనియంతో చేసిన బాంబును నాగసాకీ పట్టణం మీద వేసింది. మొదటి బాంబు కంటే మరింత శక్తివంతమైన బాంబు వేయటం జరిగింది. దాంతో నాగసాకీ పట్టణంలో కూడా బాంబు పడ్డ వెంటనే 80,000 మంది అక్కడికక్కడే మరణించారు. అభివృద్ధి చెందినప్రాంతాలన్నీ బూడిదగా మిగిలాయి. కుటుంబాలు, నాగరికత, విద్యాలయాలు, వైద్యశాలలు, మిలిటరీ కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాలు, హార్బర్స్, ప్రార్థనా మందిరాలు నేలమట్టమయ్యాయి.

చిన్నపిల్లలు, వృద్ధులు, డాక్టర్లు, నర్సులు, తలలు చితికి, కాళ్ళు, చేతులు, ఒళ్ళంతా ఛిద్రమై, రక్తాలు కారుతూ, ఎముకలు, పేగులు బయటకొచ్చి, కొస ఊపిరితో, ఆర్తనాదం చేస్తున్నా ఆదుకునే చేతుల్లేక, మందుల్లేక, వైద్యం అందుబాటులో లేక, ఆస్పత్రులు లేక అతి భయంకరమైన బాధతో ప్రాణాలు వదిలిన ఘట్టాలు ఎన్నో.

ఈ యుద్ధంలో ఎంత మంది 'మనుషులు' మరణించారని యుద్ధోన్మాదులు ఎందుకు ఆలోచిస్తారు?సామ్రాజ్యవాదానికి, యుద్ధోన్మాదానికి విధ్వంసమే విందు కదా! ఎదుటివారిని, ఎదుటి దేశాల మీద, వనరుల మీద, ఆయిల్ నిక్షేపాల మీద తమదైన ఆధిపత్యాన్ని కొనసాగించడానికి చేసే ఈ యుద్ధం అభివృద్ధికి బాటలు వేస్తుందా? యుద్ధాల వలన ఏ దేశమైన ప్రగతిపథంలో నిలబడగల్గిందా? మానవత్వాన్ని రక్షించిందా? పెంపొందింప చేసిందా? అని ఆలోచించాలి.

ఈ రెండు ఆటంబాంబులను హిరోషిమా, నాగసాకీ పట్టణాలపై వేసిన అమెరికా ప్రెసిడెంట్ మాత్రం, చాలా సంతోషంగా రక్షస నవ్వులు నవ్వుకుంటుంటాడు. అందుకే ఈ యుద్ధాల వలన తాము ఎంతో శక్తివంతంగా ఎదిగామని ఇకపై మా దేశం, ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన దేశంగా గుర్తింపు పొందుతుందన్నాడు. ఈ రకమైన ప్రకటన, ఆ దేశం యొక్క యుద్ధోన్మాద విధానాన్ని, యుద్ధ కాంక్షను, సామ్రాజ్యవాద లక్షణాన్ని ప్రపంచం ముందు ఉంచిందనవచ్చు.

జపాన్ లో ఈ బాంబులు పడ్డ చోట యుద్ధం వద్దు - శాంతి కావాలని, యుద్ధాలకు వ్యతిరేకంగా, ఒక స్మారక క్షేత్రాన్ని నిర్మించారు. 1964 నుండి ఆ ప్రాంతంలో నిరంతరం పీస్ మెమోరియల్ పార్క్ లో "శాంతి జ్యోతి" వెలుగుతూనే ఉంది. ఈ శాంతి జ్యోతి వెలుగులు భూగోళం నిండా విస్తరించాలని, ఈ భూమ్మీద అన్ని దేశాల దగ్గర ఉన్న న్యూక్లియర్ బాంబులను నాశానం చేసేంత వరకు, ఈ భూమ్మీద ఒక అణుబాంబు కూడా లేని రోజు వచ్చే వరకు, శాంతి స్థాపన జరిగే వరకు, శాంతి జ్యోతి వెలుగుతూనే ఉంటుంది.

ఐక్యరాజ్యసమితిలో భాగమైన "వరల్డ్ పీస్ కౌన్సిల్, వరల్డ్ పీస్ కౌన్సిల్ కు అనుబంధంగా శాంతి సంఘీభావ ఉద్యమాలను నిర్వహిస్తున్న "అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం, యుద్ధాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి, జాత్యహంకార వాదానికి వ్యతిరేకంగా పోరాడుతుంది. ఈ భూమ్మీద పుట్టిన ప్రతి మనిషి "జీవించే హక్కు"తో శాంతియుత వాతావరణంలో యుద్ధాలు లేని సమాజంలో సంతోషంగా జీవించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (AIPSO) పోరాడుతుంది. ముఖ్యంగా ఈ రాష్ట్రంలో స్కూళ్లలో, జూనియర్, డిగ్రీ కాలేజీలలో చదువుతున్న విద్యార్థుల్లో యుద్ధ వ్యతిరేక భావజాలాన్ని, చైతన్యాన్ని రగిలిస్తుంది. సమావేశాలు, చర్చల ద్వారా శాంతి ఉద్యమ సాహిత్యం ద్వారా శాంతి స్థాపనకు అన్ని స్థాయిల్లో కృషి చేస్తుంది.

హిరోషిమా, నాగసాకీ జ్ఞాపకాలు మరచిపోక ముందే యుద్ధోన్మాద దేశాలు ఇప్పుడు కూడా ఈ భూమ్మీద యుద్ధాలకు తలపడుతున్నాయి. మానవత్వాన్ని మరిచిపోయి, మృత్యుగీతాన్ని ఆలపిస్తున్నాయి. ఇకనైనా ఈ ప్రపంచలోని మేధావులు, అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతి ఉద్యమాలు నిర్వహించాలి. బలోపేతమైన శాంతి సంఘీభావ ఉద్యమాల ద్వార యుద్ధాలను, తరిమి కొట్టాలి. శాంతిని స్థాపించాలి.

*యుద్ధంలో చనిపోయిన వారికి జోహార్లు*
*యుద్ధోన్మాదం... సామ్రాజ్యవాదం నశించాలి.*
*ప్రపంచ శాంతి వర్ధిల్లాలి*
*అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (AIPSO) వర్ధిల్లాలి.*



**- కే.వి.ఎల్.**
రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి
అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం

# ఇద్దరు మంత్రులకు ఒకటే విజ్ఞప్తి



**విశ్వంభర, నార్కట్‌పల్లి :** కృష్ణా జలాలు వృధాగా దిగువకు వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టి నాగార్జునసాగర్ నుండి పానగల్లు ఉదయ సముద్రానికి నీటిని విడుదల చేసి బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టును నింపి నల్లగొండ జిల్లా ప్రజలకు సాగునీరు అందించాలి అని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నార్కట్పల్లి లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, రేషన్ కార్డుకు సంబంధం లేకుండా రైతులందరికీ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ డబ్బులు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు.

జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రు లకు నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను మీరు ప్రభుత్వంలో ఉన్నందున మన ఉమ్మడి నల్గొం డ జిల్లాకు అత్యధిక నిధులు తెచ్చి పెండింగ్ లో ఉన్న ధర్మారెడ్డి ,పిల్లాయపల్లి కాల్వల తో పాటు, ఐటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టు కు సంబంధించిన కాల్వ పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేసారు.

# న్యాయ కోవిదులతో భేటీ



**విశ్వంభర, న్యూఢిల్లీ :** రాజ్యసభలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పార్టీ ప్రముఖులతో కలిసి ఢిల్లీలో న్యాయ కోవిదులతో సమావేశమయ్యారు.ఎంపీ రవిచంద్ర పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కే.టీ.రామారావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీష్ రావు,గంగుల కమలాకర్, గుంటకండ్ల జగదీష్ రెడ్డి, దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డిలతో కలిసి ఢిల్లీలో సోమవారం అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ ఎన్నికల గుర్తుతో గెల్చి వేరే పార్టీలోకి ఫిరాయించిన శాసనసభ్యులపై అనర్హత వేటు వేసే అవకాశాలపై రాజ్యాంగ నిపుణులు,న్యాయ కోవిదులతో చర్చించారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



**విశ్వంభర, నకిరేకల్ :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తాటికల్ గ్రామ ప్రత్యేక అధికారి యం.డి అతహర్ పర్వేజ్ అన్నారు. గ్రామంలో జరిగిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాటికల్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకట్ రెడ్డి, లొట్లపల్లి కోటయ్య, గ్రామ కార్యదర్శి రవీంద్రా చారి, ఆశా వర్కర్లు శోభా రజని అనిత తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత మనందరి బాధ్యత




**విశ్వంభర, మెట్‌పల్లి :** మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనము పచ్చదనం కార్యక్రమాన్ని మెట్పల్లి పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాణావేణి సుజాత సత్య నారాయణ ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వము స్వచ్ఛదనము పచ్చదనం కార్యక్రమం ప్రారంభించడం చాలా మంచి కార్యక్రమం అని, ఇది ప్రజలు గ్రహించాలని మన ఇంటిని మనమే శుభ్రం చేసుకునే విధంగా మన ఇంటి పరిసరాలలో అపరిశుభ్ర వస్తువులలో నీరు నిల్వ ఉన్న తొలగించాలని, ఇంటి పరిసరాలలో, ఇంట్లో చెత్త చెదారాలు లేకుండా తొలగించి వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నా రు. దోమల బెడద లేకుండా చేయాలని, దోమ ల ద్వారా డెంగీ, మలేరియా జ్వరాలు వచ్చే అ వకాశం ఉన్నందున ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఇంటింటికి మొక్కలు నాటాలని పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు.

# స్వచ్ఛదనం, పచ్చదనం ప్రతి ఒక్కరి బాధ్యత




**విశ్వంభర, రామగుండం :** ప్రజా జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. పెద్దపల్లి జిల్లా ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్ లో విద్యార్థులు, మహిళా సంఘాలతో కలిసి అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. నేటి నుండి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. వర్షాకాలం వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో ప్రతి ఒక్కరు క్లీన్ అండ్ గ్రీన్ సిటీ కోసం సహకరించాలని కమిషనర్ శ్రీకాంత్ కోరారు.

# పెద్దపల్లి పట్టణంలో స్వచ్ఛదనం - పచ్చదనం




**విశ్వంభర, పెద్దపల్లి :** పారిశుద్ధ్య నిర్వహణ, గ్రీనరీ పెంపు లక్ష్యాలుగా ప్రభుత్వం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్ర మాన్ని ప్రారంభించిందని, పెద్దపల్లి జిల్లాలో ఈ కార్య క్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్య క్రమాన్ని పెద్దపల్లి పట్టణంలో ప్రారంభించారు. పెద్దపెల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి అమర్ నగర్ చౌరస్తా , మసీదు, జెండా, సివిల్ ఆసుపత్రి మీదుగా మళ్లీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్ర మంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ ప్రమోద్ కుమార్, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఈగా చిలుకూరి ఐశ్వర్య



**విశ్వంభర, చండూర్ :** పేదరికాన్ని జయించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో ఏఈఈ గా ఉద్యోగాన్ని చిలుకూరి ఐశ్వర్య సాధించింది.ఈ సందర్భంగా చండూర్ లోని తాను చదువుకున్న గాంధీజీ స్కూల్ యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కనగల్ మండలం జి.ఎడవల్లి గ్రామానికి చెందిన చిలుకూరి ఐశ్వర్య సివిల్ ఇంజనీరింగ్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈమె చండూరు గాంధీజీ విద్యాసంస్థలలో పదవ తరగతి వరకు చదివింది . ఏఈఈ ఉద్యోగం సాధించినందుకు గాను పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు శాలువాను కప్పి జ్ఞాపకను అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ పదవ తరగతి వరకు గాంధీజీ పాఠశాలలో చదువుకొని, ఇంటర్ నల్లగొండ ప్రగతి జూనియర్ కళాశాలలోనూ, వివిఎన్ఐటి నాగపూర్ లో బీటెక్ పూర్తి చేసిందని, ఆగస్టు రెండవ తేదీన ప్రకటించిన ఏఈఈ ఉద్యోగ పోటీ పరీక్ష ఫలితాలలో సివిల్ ఇంజనీరింగ్ ఉద్యోగానికి ఎంపికైనదని తెలిపారు. చిలుకూరి ఐశ్వర్య తండ్రి చేనేత కార్మికుడని, తాను కష్టపడి కూతుర్ని చదివించారని, ఆమె చదువుకు పేదరికం అడ్డు రాలేదని, ఐశ్వర్యను ఆదర్శంగా తీసుకొని పిల్లలందరూ కష్టపడి చదవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, తండ్రి చిలుకూరు వెంకటేశం, పులిపాటి రాధిక పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో స్వచ్ఛదనం-పచ్చదనం





**విశ్వంభర, మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం - పచ్చదనం ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు యాద్గరిపల్లి గ్రామంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం, పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి అనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఐదు రోజుల వినూత్నమైన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజలు అందరు సమన్వయం చేసుకొని బాధ్యతగా పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, ఎమ్మార్వో, ఎంపిడిఓ, అధికారులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బ్రహ్మసూత్ర శివాలయంలో భక్తుల అభిషేకాలు



**విశ్వంభర, నార్కెట్‌పల్లి :** నల్లగొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం అక్కెనపల్లి గ్రామంలో కల ప్రసిద్ధ పురాతన బ్రహ్మసూత్ర శ్రీ రామలిగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి సోమవారం సందర్భంగా నార్కెట్ పల్లి పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్య లో విచ్చేసి భజనలు కీర్తనలతో, స్వామికి ఇష్టమైన లింగాష్టకం పారాయణం చేసి పరమ శివునికి పూజారి భగవాన్ శర్మ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి భగవాన్ శర్మ మాట్లాడుతూ శ్రావణ మాసం శివునికి ఇష్టమైన మాసమని కాబట్టి ప్రతి రోజు శివాలయ సందర్శన ఎంతో పుణ్య దాయాకమని, ప్రతి భక్తుడు తప్పకుండా రోజు శివాలయ సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో దోసపాటి విష్ణు మూర్తి, అమరవాది రాములు, చల్ల వాసుదేవ్, సరాబు శ్రీనివాస్, మహిళా భక్తులు అర్ధం కృష్ణవేణి, సరాబు పద్మ, రంగా పద్మ, సూర కలమ్మ, దోసపాటి విజయ, భాగ్యమ్మ ,గట్టు లీల, రాజేశ్వరమ్మ ,చల్ల కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



## మహాదేవపూర్ నేత కార్మికునికి రాష్ట్రస్థాయి అవార్డు

**విశ్వంభర, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని టస్సర్ కాలనీకి చెందిన నేత కార్మికుడు గోరంట్ల శ్రీనివాస్ కొండ లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి చేనేత అవార్డుకు ఎంపికయ్యారు. నేత కార్మికుడు ప్రకృతి సిద్ధ రంగులతో చేసిన బుటా చీర రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. ఈనెల 7న హైదరాబాదులోని ఫీపుల్స్ ప్లా జాలో నిర్వహించే జాతీయ హ్యాండ్లూమ్ డే కార్యక్రమంలో అవార్డు, 25 వేల రూపాయల నగదు అందుకోనన్నట్లు తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి వై.వెంకట్ గాంధీ కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర రావుని ఢిల్లీలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.
– విశ్వంభర, న్యూఢిల్లీ



# పచ్చదనంతోనే మానవ మనుగడ

**విశ్వంభర, కుత్బుల్లాపూర్ :** సుభాష్ నగర్ లో నిర్వహించిన పచ్చదనం - స్వచ్ఛదనం కార్యక్ర మానికి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅ తిథిగా హాజరై చెట్టును నాటారు.ఈ సందర్భం గా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలని ఇంటి పరిసర ప్రాంతాలలో చెత్త చెదారం లేకుండా చూసుకోవాలని ప్రతి ఒక్కరూ చెట్లను నాటి పచ్చదనాన్ని పెంపొం దిస్తే వాతావరణ కాలుష్యం తగ్గి ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. దోమల బెడద లేకుండా జ్వరాలు రాకుండా డెంగు మలేరియా వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ నర్సిం హా, ఏ.ఎమ్.హెచ్.ఓ భార్గవ్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రోమ్ వాటర్ లైన్ పనులు ప్రారంభం

**విశ్వంభర, అంబర్ పేట్ :** కాచిగూడ డివిజన్ లో కోటి రూపాయల నిధులతో చేపట్టిన స్ట్రోమ్ వాటర్ లైన్ పనులకు సోమవారం నాడు అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్న ఉమా రమేష్ యాదవ్ లతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ పేరి రాజు, ఏఈ విశ్వతేజ, డివిజన్ ప్రెసిడెంట్ భీష్మ దేవ్, స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# దళిత మహిళపై దాష్టీకం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** దళిత మహిళపై చెప్పలేని తరహాలో థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఇలాంటి ఘోరమైన చర్యకు పాల్పడిన పోలీసులను వెంటనే విధుల నుండి శాశ్వతంగా తొలగించాలని బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మోత్కూరు మున్సిపాలిటీ అధ్యక్షులు చెడిపెల్లి రఘుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మోత్కూర్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి కూరెళ్ళ రమేష్, సైబరాబాద్ పరిధిలోని షాద్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన సునీత భీమయ్య దంపతులను పోలీసులు ఓ దొంగతనం ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారు. పక్కింట్లో నివాసముంటున్న నాగేందర్ అనే వ్యక్తి వీరిపై గత నెల 24వ తేదీన షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. తమ ఇంట్లో బంగారం దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రామ్ రెడ్డి మరో నలుగురు పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత భర్త భీమయ్యను వదిలేసిన పోలీసులు కుమారుడు 13 ఏళ్ల జగదీష్ తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు తల్లి కొడుకులను అదుపులోకి తీసుకొని పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఇంటరాగేషన్ చేశారు. డిఐ రాంరెడ్డి సునీతను చిత్రహింసలకు గురి చేసినట్టు బాధితురాలు పేర్కొంది. పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చిన రాత్రి తనను కన్నకొడుకు ముందే బట్టలు విప్పించి కాళ్ల మధ్యన కర్రలు పెట్టి బూటు కాళ్లతో తన్నుతూ కొట్టారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసిందని తెలిపారు . ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి కూరెళ్ళ రమేష్,ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాగర్, బందెల శ్రీను నరేష్, వెంకన్న, కడమంచి యాదగిరి,కూరెళ్ళ సందీప్,పాల్గొన్నారు.



## ప్రజావాణిలో దరఖాస్తులు



**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భూపాల పల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 69 దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలు పరిష్కరించాలని ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. దరఖాస్తులు పరిష్కారానికి ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు నియమించాలని, దరఖాస్తు పరిష్కార వివరాలు వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. మండల స్థాయిలో ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల పరిధిలోని సమస్య అయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరు భాగస్వాములు కావాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని అన్ని గ్రామ పంచాయ తీల్లో సోమవారం రోజు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆత్మకూరు(ఎం) గ్రామ పంచా యతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి మండల ఎంపీడీ ఓ రాములు నాయక్ గారి అధ్యక్షతన జరిగిన గ్రామ సభ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు నాయకులు ప్రజలు తెలిపిన అభిప్రాయాల మేరకు ముఖ్య అతిథిగా హాజరు అయిన మండల ప్రత్యేక అధికారి (జిల్లా మత్స్య శాఖ అధికారి) రాజారాం , గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీడీఓ రాములు నాయక్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు చేపట్టే ఏ కార్యక్రమం అయినా తమ వంతుగా ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ఐదు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది అని ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి ఆనంద్ కుమార్, మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రా రెడ్డి, అఖిల పక్ష నాయకులు తుమ్మల నర్సిరెడ్డి, యాస లక్ష్మా రెడ్డి, బీసు చందర్ గౌడ్,గజరాజు కాశీనాథ్, యాస ఇంద్రారెడ్డి, పోతగాని మల్లేశం, లోడి వెంకటయ్య, కోరే భిక్షపతి, కానుగంటి శ్రీశైలం,మజ్జిగ రాంబాబు, కోరే మల్లేశం, మజ్జిగ నరేష్, అంగన్వాడి టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎఎన్ఎంలు , ఆశా వర్కర్ లు , వీవోఏ లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎంపీడీఓకి సన్మానం

**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాములు నాయక్ ని టీ జే యూ మండల అధ్యక్షులు గడ్డం నాగరాజు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ ఒక వారం రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాలల్లో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నామని జర్నలిస్టులు ప్రజలకు అవగాహన కలిగే విదంగా తోడ్పాటు అందించాలని కోరారు . ఈ కార్యక్రమంలో టీ జే యూ మండల గౌరవ అధ్యక్షులు నోముల రవీందర్ రెడ్డి, టీ జే యూ మండల గౌరవ సలహాదారులు గుర్రాల నాగరాజు, టీ జే యూ మండల ఉపాధ్యక్షులు షేక్ అజీజ్, టీ జే యూ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మల్లేష్ , టీ జే యూ మండల అధికార ప్రతినిధి పొన్నగాని సతీష్ గౌడ్, టీ జే యూ మండల మహిళా కన్వీనర్ దంతూరి సుమలత గౌడ్, టీజేయూ మండల సహాయ కార్యదర్శి పానుగంటి బాల గంగాధర్, టీజేయూ మండల కోశాధికారి కట్టెకోల రమేష్, టీజేయూ మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి



**విశ్వంభర, ఆమనగల్లు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం ,- పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మండలం లోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో కుసుమ మాధురి, కమిషనర్ వసంత పిలుపునిచ్చారు. ఎంపీడీవో కుసుమ మాధురి మాట్లాడుతూ ఆగష్టు 5 నుండి 9 వ తేది వరకు 5 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా కాపాడుకొవచ్చు అని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. 33 శాతంగా ఉండాల్సిన అటవీ చెట్లు కొట్టేయడం వల్ల గణనీయంగా పడిపోయింది తద్వారా వర్షాలు పడటం లేదని చెప్పారు.

## బోరు వేయించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, ఎల్లారెడ్డి :** నీటి సమస్యతో బాధపడుతున్న కాలనీవాసులకు కామారెడ్డి జిల్లా పరిధిలోని ఎల్లారెడ్డి పట్టణంలోని రెండవ వార్డు లో ప్రజల కోరిక మేరకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు స్పందించి బోరును వేయించారు. బోరు సక్సెస్‌గా వాటర్ రావడంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యే మదన్మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## రామన్నపేటలో స్వచ్ఛదనం-పచ్చదనం




**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని గ్రామాల్లో 5 నుండి 9వ తారీకు వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి స్వచ్ఛ దనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రామన్నపేట మండలంలోని గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు,తాజా మాజీ సర్పంచ్లు, తాజా మాజీ ఎంపీటీసీలు,వార్డు మెంబర్లు, మహిళలు పాల్గొన్నారు.

## 13వ డివిజన్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం




**విశ్వంభర, బోడుప్పల్:** 13వ డివిజన్ లో స్వచ్ఛదనం- పచ్చదనం అనే కార్యక్రమం మున్సిపల్ అధికారులు ఆర్ ఐ కమలాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యర్థ పదార్థాలను నిర్మూలించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం లాంటి విషయాలపై డివిజన్ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్క డివిజన్లోని కాలనీలను, రోడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు తెలియజేశారు. మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచాలని కోరారు. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ అందజేసే చెత్త డబ్బాలను ఏ విధంగా వినియోగించాలో ప్రజలకు వివరించారు, మున్సిపాలిటీ అందజేసే రెడ్ కలర్, గ్రీన్ కలర్ మరియు బ్లూ కలర్ డబ్బాలు. రెడ్ కలర్ లో హానికర చెత్త అనగా మెడిసిన్ కవర్లు, ప్లాస్టిక్ కవర్లు, సానిటరీప్యాడ్స్,డైపర్లు, ప్లాస్టిక్ సంబంధిత వ్యర్థాలు లాంటివి రెడ్ కలర్ డబ్బాలో వేయాలని,గ్రీన్ కలర్ డబ్బాలో తడి చెత్తను అనగా కూరగాయలు, ఆకుకూ రలు, కట్ చేసిన వ్యర్థాలను, మిగిలిన అన్నం ,పాడైపో యిన తడి పదార్థాలను వేటినైనా గ్రీన్ డబ్బాలో వేయాల ని, అలాగే బ్లూ డబ్బాలో పొడి పదార్థాలను అనగా ఇల్లు ఊడ్చగా వచ్చిన చెత్తను, ఆకులు, పేపర్లు, పొడిగా ఉండే పదార్థాలను బ్లూ డబ్బాలో వేయాలని డివిజన్ వాసులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గోపు రాములు, కాలనీవాసులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ

**విశ్వంభర, బషీర్ బాగ్:** తాండూరు శాసన సభ్యులు తెలంగాణ రాష్ట్ర హెూంగార్డు సంఘం చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కెపిహెచ్బి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సైబరాబాద్ ట్రాఫిక్ హెూంగార్డు బి. గోపాల్ ఆధ్వర్యంలో వృద్ధుల ఆశ్రమం మియాపూర్ లో పండ్లు, కూరగాయల పంపిణీ చేశారు. రాష్ట్ర హెూంగార్డుల సంఘం చైర్మన్ కు వృద్ధ మహిళలు అందరు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో సైబరాబాద్ కమిషనరేట్ హెూంగార్డులు బష్వరాజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**విశ్వంభర, నారాయణపూర్ :** శ్రీ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమం ఆధ్వర్యంలో కామినేని హాస్పిటల్ నార్కెట్పల్లి వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఆగస్టు 6న నిర్వహించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిర కరపత్రాన్ని ఎస్సై జగన్ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కామినేని హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియం చేసుకోవాలని సూచించారు. జనరల్ ఫిజీషియన్, ఎముకల వైద్యులు, స్త్రీ వైద్య నిపుణులు, దంత వైద్యులు, జనరల్ సర్జరీ, కంటి వైద్య నిపుణులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు పాల్గొననున్నారు. ఉచిత పరీక్షలు బీపీ, షుగర్ ,దంత పరీక్షలు, గుండె పరీక్ష, ఊపిరితిత్తుల పరీక్ష ,ఉచిత మందుల పంపిణీ కలదని తెలిపారు.

## స్వచ్ఛదనం పచ్చదనం అవగాహన ర్యాలీ




**విశ్వంభర, వికారాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు, చైర్ పర్సన్ సొంత వార్డులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ర్యాలీతో ప్రారంభించారు. ఈ ర్యాలీలో వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ పాల్గొని స్వచ్ఛదనం పచ్చదనంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, స్థానిక నాయకులు, శానిటేషన్ ఇంచార్జ్ ఎస్సై యేసు, మున్సిపల్ సిబ్బంది రామకృష్ణ, వినోద్, మహిపాల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీనివాస్, నారాయణ స్కూల్ విద్యార్థులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఆగస్టు 21 నుండి 24 వరకు ఆటోమేషన్ ఎక్స్ పో 2024

**విశ్వంభర, బషీర్ బాగ్:** ఆటోమేషన్ ఎక్స్ పో ఐఈడి కమ్యూనికేషన్స్ లిమిటెడ్, 17వ అంతర్జాతీయ ఎగ్జిబిషన్, కాన్ఫరెన్స్ అయిన ఆటోమేషన్ ఎక్స్ పో 2024 ఆగస్టు 21 నుంచి 24 వరకు ముంబైలోని నెస్కోలోని బీఈసీలోని హాల్ 1, 2లో ఈ కార్యక్రమం జరగనుందనీ పేర్కొంది. 30,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 500కు పైగా స్టాల్స్, 1,000కు పైగా కంపెనీలతో ఈ ఏడాది ఎక్స్ పో 22 ఏళ్ల చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందనీ వెల్లడించింది. ఇది భారతీయ పరిశ్రమ వృద్ధి విజయాన్ని ప్రదర్శిస్తుందని తెలిపింది.

# టి-సాట్ ప్రత్యేక పాఠాలు



**విశ్వంభర, హైద్రాబాద్ :** గ్రూప్-1 మేయిన్స్ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం టి-సాట్ ప్రత్యేక పాఠాలు ప్రసారం చేయనుంది. ఇప్పటికే ప్రిలిమ్స్ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ప్రత్యేక అవగాహన పాఠ్యాంశాలు అందించిన టి-సాట్ మేయిన్స్ అభ్యర్థుల కోసమూ 750 ఎపిసోడ్స్ సిద్ధం చేసింది. టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం టీజీపీయస్సీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అనేక పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు వెన్నుదన్నుగా నిలిచిన టి-సాట్ గ్రూప్-1 మేయిన్స్ అభ్యర్థులకూ పూర్తి స్థాయిలో అండగా నిలువనుందని సీఈవో హామీ ఇచ్చారు. మరో మూడు నెలల్లో జరగనున్న గ్రూప్-1 మేయిన్స్ పరీక్షకు సైతం అదే ప్రోత్సాహాన్ని టి-సాట్ అందిస్తోందని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఈవో సూచించారు. లక్షల రూపాయలు వెచ్చించి కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉండి టి-సాట్ అందించే ప్రసారాల ద్వారా నిరుద్యోగ యువత మంచి ఫలితాలు సాధించవచ్చని సీఈవో వేణుగోపాల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.




## అభివృద్ధికి అడ్డు

**విశ్వంభర, కామారెడ్డి :** 75వ వన మహోత్సవం పచ్చదనం స్వచ్ఛదనంపై ర్యాలీలో పాల్గొని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ప్రసంగించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ గారు మాట్లాడుతూ కామారెడ్డి లో ఎన్నికల్లో పోటీ చేయకున్నా కూడా కామారెడ్డి పుట్టిన గడ్డపై ఉన్న ప్రేమతో అభివృద్ధికి కృషి చేస్తున్నాని , అభివృద్ధిలో పోటీ పడాలే తప్ప అభివృద్ధిని అడ్డుకోవడంలో కొందరు పోటీపడుతున్నరంటు దుయ్యబట్టారు. ప్రతి ఒక్కరు చెట్లను నాటాలి.. నాటిన చెట్లను సంరక్షించాల్సిన బాధ్యత పౌరునిపై ఉందని అన్నారు.

## ద్విచక్రవానం అదుపుతప్పి వ్యక్తి మృతి



**విశ్వంభర, మేడిపల్లి :** వెంకటాద్రి టౌన్ షిప్, చౌదరిగూడకు చెందిన మాలె ఆంజనేయులు తండ్రి కర్రెప్ప వయస్సు 35 సంవత్సరాలు వృత్తి డ్రైవరు ఆదివారం చిలకనగర్‌కు చెందిన తన అక్క ఇంటికి బోనాలకు పండుగకు తన ద్విచక్రవానంపై వెళ్లి తిరుగు ప్రయాణంలో మేడిపల్లి సిపిఐ రోడ్డు దగ్గర ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టాడు. దీంతో తీవ్రగాయాలపాలైన ఆంజనేయులు అక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అనారోగ్యాల బారిన పడకండి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** పరిసరాల పరిశుభ్రత తోనే అనారోగ్యాల బారిన పడకుండా ఉంటామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలక ఉపేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆర్కె డివిజన్లోని హరిపురి కాలనీ ,ఎన్టీఆర్ నగర్‌లో స్వచ్ఛధనం- పచ్చదనము కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆగష్టు 5 నుండి 9 వ తేది వరకు 5 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. తమ ఇళ్ళలో, పరిసరాల్లో పరిశుభ్రం చేసుకొని స్థలం ఉన్న ప్రతిచోటా మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హరిపురి కాలనీ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, శ్రీధర్ రావు, సుజాత రెడ్డి, సూపర్వైజర్లు కీర్తి, కొండల్ రెడ్డి ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మంజూరు కోసం ఎమ్మెల్యేకి వినతి



**విశ్వంభర, హైద్రాబాద్ :** ఆమనగల్లు మండలం శంకర్ కొండ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న దయ్యాల బొడు తాండకు. కత్వా వాగు వంతెన వరకు సుమారు 500 మీటర్ల దూరం వరకు బీటీ రోడ్డు లేక గిరిజన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.సోమవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో గ్రామ మాజీ వార్డు మెంబర్ రాజు నాయక్,విజయ్ రాథోడ్ ,కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేసి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి దయ్యాల బొడు తండాకు బీటీ రోడ్డు వచ్చే విదంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూవజన నాయకులు శ్రీను, నవీన్, రమేష, రాజేష్, విజయ్, వినోద్, సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత బాధ్యత అందరిది





**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా ఘనపురం మండల కేంద్రంలోని గ్రామపంచాయితీ ఆవరణలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మొక్కలు నాటి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా మరుగుదొడ్డి నిర్మాణానికి, గ్రామపంచాయితీ ఆవరణలో సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని విద్యార్థులతో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయం నుండి గణపురం మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వరకు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమ అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ నరేష్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో భాస్కర్, ఎస్ బి ఎం కో ఆర్డినేటర్ వెంకటేష్, మెడికల్ ఆఫీసర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు



**విశ్వంభర, కడ్తాల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం స్థానిక కడ్తాల్ మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో సుజాత, మండల ఇన్చార్జి రామేశ్వరీ దేవి, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులతో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా ఒక మొక్క నాటితే అదే వృక్షమై భవిష్యత్తు తరాలను కాపాడుతుందని సమతుల్యతను కాపాడాలంటే చెట్లు నాటడం మానవ మనుగడకు చాలా ముఖ్యమని తెలియజేశారు. అదేవిధంగా ఫ్యాక్టరీల నుండి నిలబడే విష వాయువులను మరియు వాహనాల నుండి వెలుపడే చెడు వాయువులను ఒక్క చెట్టు మాత్రమే తీసుకొని మనకు ఆక్సిజన్ అందజేస్తాయి అందుకని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి మానవ మనుగడకు దోహదపడాలని తెలియజేశారు. అనంతరం కడ్తాల్ మండల ప్రధాన వీధుల గుండా స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం తెలియజేస్తూ ర్యాలీని విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి నర్సింహా రెడ్డి, ఎంపీడీవో సుజాత, కడ్తాల్ మండల్ ఇన్చార్జి రామేశ్వరీ దేవి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, పాండు, రాజేష్, రాజేందర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, కోరుట్ల :** కోరుట్ల నియోజకవర్గఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ పెద్దాపూర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఇటీవలె పాఠశాలలో విద్యార్థి మృతి చెందిన ఘటనపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టి తీసుకురావాలని ఎప్పుడు మీకు అందుబాటులో ఉంటనని విద్యార్థులకు తెలిపారు. ఆయన వెంట నాయకులు దారిశెట్టి రాజేష్, మారుసాయి రెడ్డి, కోరేపు రవి, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

## మోటార్ ఆన్ చేయకుండానే
# బోర్ నుంచి ఉబికి వస్తున్న నీరు



**విశ్వంభర, ఏలూరు:** ఏలూరు జిల్లాలో విచిత్రమైన ఘటన జరిగింది. బోర్ ఆన్ చేయకుండానే నీళ్లు ఉబికి వస్తున్నాయి.. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. కామవరపుకోట మండలం కేస్ రామవరంలో బోరు ఉంది.. దాని నుంచి నీరు ఎగిసిపడుతోంది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బోరు ఉన్న ప్రాంతం చుట్టూ వరద నీరు చేరింది. దీంతో బోరు ఆన్ చేయకుండానే నీరు వస్తుండడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఒక్కసారిగా బోరు నుంచి నీరు ఉబికి వస్తుండగా స్థానికులు వీడియో రికార్డ్ చేశారు. వరద నీరు కారణంగా ఓవర్ ఫ్లోతోనే బోరు నుంచి నీళ్లు ఇలా ఉబికి వస్తున్నాయంటున్నారు స్థానికులు. గతంలో కొన్ని వందల అడుగుల్లో బోరు వేసినా నీళ్లు రాని పరిస్థితి ఉంది.. ఇప్పుడు వర్షాల కారణంగా మోటార్ ఆన్ చేయకుండానే నీళ్లు బోరు నుంచి ఉబికి వస్తోంది. ఈ బోర్ ఆన్ చేయకుండానే నీరు వస్తుండటంతో స్థానికులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఈ విషయం తెలియడంతో జనాలు వెళ్లి చూస్తున్నారు. మరోవైపు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాను వర్షాలు ముంచెత్తాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. వరి నారుమళ్లు, నాట్లు వేసిన పొలాలు ముంపులో చిక్కున్నాయి. ఈదురుగాలులతో చెట్లు కూలిపోయి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరో రెండు, మూడు రోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తుండటంతో కలెక్టర్ నాగరాణి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేశారు. తణుకు మండలం దువ్వ ప్రాంతంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి పరిశీలించారు. యనమదుర్రు డ్రెయిన్‌లో వరద పెరగడంతో.. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. కొత్తపేట కాలనీ దగ్గర ముంపులో ఉన్న గుడిసెలను సందర్శించి అక్కడివారిని పునరావాస కేంద్రానికి పంపించారు. అలాగే కలెక్టరేట్‌లో ఇప్పటికే కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారుల్ని ఆదేశించారు. మరోవైపు మూడు రోజులుగా కురుస్తున్న వానలకు ఎర్ర కాలువకు వరద పోటెత్తింది. దీంతో సుమారు 9500 ఎకరాలు నీట మునగగా.. పలు ప్రాంతాలు నీటమునిగాయి.



## చెట్లు నాటడం సామాజిక బాధ్యత

**విశ్వంభర, మాల్యాపూర్ :** స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మాల్యాపూర్ గ్రామంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఇంటి పరిసరాలలో చెట్లను పెంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. కూలర్లలో ఇతర పాత్రలలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలతో డెంగీ జ్వరాలు వస్తాయని ఉపయోగించని వాటిలల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వ్యర్థాలను ఖాళీ ప్రదేశాలలో వేయకుండా గ్రామ పంచాయితీ చెత్త సేకరణ బండ్లలో వేయాలని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రభు,హెడ్మాస్టర్ సదేశ్ కుమార్,ఏపిఓ స్రవంతి,పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ మాజీ ఎంపిటిసి ఈశ్వర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ బిసిసెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్,గ్రామ శాఖ అధ్యక్షుడు కాశిపాక శంకర్,కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం
### ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట్ :** సీఎంఆర్ఎఫ్ పథకం ప్రజలకు వరం లాంటిదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని నారాయణకేడ్, కంగ్టి, మనూర్, నాగల్గిద్దా, శంకరంపేట్, నిజాంపేట్, కాల్హేర్, సిర్గాపూర్ మండలాలకు చెందిన బాధితులకు 200 సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య ఉచితంగా అందించడానికి ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నర్సింహా గత ప్రభుత్వంలో పెండింగ్ పెట్టిన 500 కోట్ల రూపాయల్ని ఆసుపత్రులకు చెల్లించి ప్రజలకు మెరుగైన వైద్యనికి ఒక భరోసాగా ఉన్నారని అని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయిని మధు, సీనియర్ నాయకులు నారాగౌడ్, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, కుంట్ల రాములు, రఘుపతిరెడ్డి, రాంచందర్, అశోక్, గోవింద్రావు, పున్నయ్య తదితరులున్నారు.



## రాహుల్ గాంధీ హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే కసిరెడ్డి

**విశ్వంభర, కల్వకుర్తి :** అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ కల్వకుర్తి ప్రచార సభ సందర్భంగా కల్వకుర్తి మండలంలోని జిల్లెల్ల గ్రామంలో పర్యటించారు. ఆ సందర్భంలో రైతులను పరామర్శించి గ్రామస్తులతో మాట్లాడారు పేదరికంలో ఉన్న వారి వివరాలను సేకరించారు. ఆటో కార్మికుడు కుమ్మరి నితిన్ అనే యువకునితో మాట్లాడి ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సొంత డబ్బులతో ఆటో ఇప్పిస్తానని రాహుల్ గాంధీ ఆరోజు హామీ ఇచ్చారు అతడి వివరాలను సేకరించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం అతనికి ఆటో ఇప్పించి రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆశాదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బంజారాల బతుకమ్మ తీజ్ పండుగ

**విశ్వంభర, తలకొండపల్లి :** బంజారాల బతుకమ్మ తీజ్ ఉత్సవాలను తలకొండపల్లి మం డలం పడమటి తాండ,తాళ్ళగుట్ట తాండ లో సోమవారం ఘనంగా నిర్వహించారు, ఈ తీజ్ పండుగ కు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు గిరిజన మహిళలతో కలిసి ఆడి పాడారు. తీజ్ పండగ సందర్భంగా గోధుమ బుట్టలు నెత్తిన పెట్టుకొని గిరిజనులు ప్రకృతిని ఆరాధిస్తూ గొప్పగా పూజించే గిరిజనులందరికి తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

# చెట్లు నాటి సంరక్షించండి



**విశ్వంభర, పలిమెల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆగష్టు 5 సోమవారం నుండి ఆగష్టు 9 శుక్రవారం వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం లో భాగంగా పలిమెల మండలం గ్రామ పంచాయతి నందు గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారి ఎంపీడీఓ పలిమెల గారి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారి ఎంపీడీవో , పంచాయితీ కార్యదర్శి, ఏపీఎం, ఏపిఓ ,మహిళా సంఘ సభ్యులు,హెడ్ మాస్టర్లు,టీచర్లు,ఏ ఎన్ ఎమ్,ఆశా వర్కర్స్ ,అంగన్వాడి టీచర్లు,గ్రామ ప్రజలు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కేరళ ప్రకృతి విపత్తు బాధితులను ఆదుకోండి




**విశ్వంభర, భద్రద్రి కొత్తగూడెం :** కేరళ ప్రకృతి విపత్తు బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేరళ రాష్ట్రంలోని వాయినాడు జిల్లాలో ప్రకృతి విపత్తు సర్వం తుడిచిపెట్టిన విషయం తెలిసిందే. ఆ బాధితులను ఆదుకునేందుకు సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కల్లూరితో పాటు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తు కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని వేలాదిమంది నిరాశ్రయులయ్యారని చెప్పారు. తమ వారు నీటి సుడుల్లో కొట్టుకొని పోతుంటే కొందరు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దిక్కుతోచని స్థితిలో చూస్తూ ఉండిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకు వచ్చి మానవతా దృక్పథంతో బాధితులను ఆదుకునేందుకు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కరెడ్ల సురేష్ నాయుడు, సాధనపల్లి సతీష్, కృష్ణయ్య, మనసే, సీతారామరాజు, అశోక్, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల నుంచి రక్షించాలి



**విశ్వంభర, భద్రాచలం :** భద్రాచల పట్టణం లోని వివిధ కాలనీలు సెంటర్లలో ఉన్న వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలని ఐటీడీఏ పీవో బి రాహుల్ ను గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు బండారు శరత్ బాబు కోరారు. ఈ మేరకు సోమవారం పిఓని ఆయనతోపాటు స్థానికులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఐదు నుంచి 10 వరకు గుంపులుగా కుక్కలు తిరుగుతూ వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయని వారు వాపోయారు. మోటార్ సైకిళ్లు పై వెళ్లే వారిపై కూడా అవి ఎగబడుతున్నాయని వాటి నుంచి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరుతూ నాల్గవ వార్డు మాజీ సభ్యులు, స్థానికులు ఐటీడీఏ పీవో ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వమే సంరక్షణ చర్యలు చేపట్టాలని, వాటిని సంరక్షణ కేంద్రాలకు తరలించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాల్గవ వార్డు మాజీ సభ్యులు బండారు శరత్ బాబు వీధి కుక్కల ద్వారా వచ్చే ఇబ్బందులను పిఓ రాహుల్ కు వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మనాభుని రవికుమార్, అనుముల గంగాధర్, పిరెంట్ల శ్రీకాంత్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రమణరెడ్డి, కోటగిరి వెంకటేశ్వర రావు, వరబాబు, రేపాక రాంబాబు ఉన్నారు.

# అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు



**విశ్వంభర, వికారాబాద్ :** వికారాబాద్ నియోజకవర్గంలో సోమవారం రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, రెవెన్యూ, గృహ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు 60 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి నుండి రాళ్లచిట్టంపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు 12 కోట్ల వ్యయంతో, వికారాబాద్ పట్టణ కేంద్రంలో 4 సూటెడ్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మాణానికి 6 కోట్ల వ్యయంతో అదేవిధంగా మర్పల్లి నుండి కోట్ పల్లి వరకు వివిధ అనుసంధాన రోడ్ల నిర్మాణానికి 42 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణ పనుల శంకుస్థాపనలు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్, ఎస్ ఈ వసంత నాయక్ , ఇంచార్జ్ ఇఇ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, వైస్ చైర్మన్ శంషాద్ బేగం, వివిధ శాఖల అధికారులు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులను మూసేయండి సార్



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రానికి చెందిన మహిళా సంఘం సభ్యులు మండల కేంద్రంలో అక్కడక్కడ బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్ముతున్నారని... ఎక్కడపడితే అక్కడ మద్యం దొరకడం ద్వారా మద్యానికి బానిసై మా మగవాళ్ళు అనారోగ్యం పాలవుతున్నారని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తాను ఎన్నికైన మరుసటి రోజు నుండే నియోజకవర్గంలో బెల్ట్ షాపులు నిర్వహించవద్దని కఠినంగా ప్రయత్నిస్తున్నానని.. ఎక్కడైనా బెల్టు షాపుల ద్వారా మద్య అమ్ముతున్నారని మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు ఫోన్ చేయండి అని కింది స్థాయి నుండి పై స్థాయి వరకు ఉన్న పోలీస్ అధికారుల నెంబర్లు మహిళల కు ఇచ్చారు... ఎట్టి పరిస్థితుల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్య అమ్మకాలు చేపట్టొద్దని ఈ విషయంలో ఎవరు చెప్పిన ఊరుకునే పరిస్థితి లేదని పోలీసు అధికారులను ఆదేశించారు.. బెల్ట్ షాప్ ద్వారా మద్యం అమ్మకాలు చేస్తుంటే అధైర్య పడకుండా ధైర్యంగా ఫోన్ చేసి చెప్పాలని నీకు నేను అండగా ఉంటానని మహిళలకు భరోసా ఇచ్చారు . ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుల్లో రాణించాలి

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి



**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. మొక్కలు నాటడానికి వచ్చిన శాసనసభ్యులకు స్వాగతం పలికిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు పరిశీలించారు ఎమ్మెల్యే. తరగతి గదులు బాగాలేవని ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన విద్యార్థులు ఉపాధ్యాయులు. నేను తరగతి గదులు కట్టిస్తాను మీరు మంచిగా చదువుకొని జీవితంలో పైకి రావాలని అన్నారు . 10 జిపిఎ కు 10 జీపీఏ సాధిస్తామని ముక్తకంఠంతో చెప్పిన విద్యార్థులు.

# యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పర్యటన




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం ఉదయం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పర్యటించారు. మొదటగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట పట్టణంలోని ఓ వెంచర్లోని మున్సిపల్ 10% భూమిలో మొక్కలు నాటారు. స్వామివారి పాదాల వద్ద విద్యార్థులతో కలిసి స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం యాదగిరిపల్లి హయగ్రీవ స్వామి వారి ఆలయ ప్రాంతంలోని ఓ వెంచర్ 10%భూమిలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈతమొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు,ఎక్సైజ్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబమైన వల్లపు నర్సింహా ఆక్సిడెంట్ లో చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.



# స్వచ్ఛదనం-పచ్చదనంపై ప్రజలకు అవగాహన

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం'కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారులు పాల్గొని మాట్లాడారు. తిమ్మాపురం గ్రామంలో గ్రామ ప్రత్యేక అధికారి సునీల్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి అధికారులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రత అనేది ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళ సమ భావన సంఘం అధ్యక్షురాలు దాచ శ్రీలత శ్రీహరీ గుప్తా, పంచాయతీ కార్యదర్శి ఎన్ శిరీష,అంగన్వాడీ టీచర్ బట్టు వైష్ణవి,వీబీకే ఎన్ సరిత, ఏఫ్ఏ ఎన్ రవిందర్ రెడ్డి, అంగన్వాడీ ఆయా ఎండీ నస్రీన్,గ్రామ పంచాయతీ సిబ్బంది, కోల మచ్చగిరి, దేవరాజు రాజశేఖర్, వేముల రాములమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబానికి బ్యాంకు భరోసా

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** పల్లెపహాడ్ గ్రామంలో పిఏసిఎస్ బ్యాంక్ ఆత్మకూరు(ఎం) ఖాతాదారులైన రైతు జీడి సాయమ్మ అనారోగ్య కారణంగా మరణించడం జరిగింది. వారి కుటుంబానికి బ్యాంకు భరోసాగా 10,000రూపాయలు అందించారు . ఈ కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, బ్యాంక్ డైరెక్టర్ ఎగ్గిరీ యాదగిరి, తాజా మాజీ సర్పంచ్ సుబ్బూరు వెంకటేశం, బ్యాంక్ సీఈవో కిరణ్ కుమార్ రెడ్డి ,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పల్లెపహాడు కాంగ్రెసు పార్టీ గ్రామ శాఖ సభ్యులు పాల్గొన్నారు.



# తల్లిపాల వారోత్సావాలు

**విశ్వంభర, సూర్యాపేట :** తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని ఏరియా హాస్పిటల్ సెక్టార్ మంగలి గోపాల్ బజార్ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 40 వార్డ్ కౌన్సిలర్ తాహెర్ మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమంతో పాటు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఉపేంద్ర, అంగన్వాడీ టీచర్లు సావిత్రి, కవిత, ఆండాలు, అంగన్వాడీ ఆయా సరిత మరియు కాలనీ పెద్దలు, చిన్నపిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిపోతున్న ఉగ్రదాడులు

- సుప్రీం కోర్టు ఆదేశాలు అమలు చేయాలి
- జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలి
- ఆర్టికల్ 370 రద్దుచేసిన ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఖర్గే వ్యాఖ్యలు



**దిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు ప్రకారం జమ్మూకశ్మీర్లో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తద్వారా అక్కడి ప్రజలు తమ నాయకులను ఎన్నుకుంటారని తెలిపారు. జమ్మూ కశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దు చేసి, ఐదేళ్లు పూర్తైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఆర్టికల్ 370 రద్దుతో ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధి మెరుగుపడుతుందని, తీవ్రవాదాన్ని అరికట్టే అవకాశం ఉంటుందని గతంలో మోదీ చెప్పారు. అయితే.. ప్రస్తుతం ఆయన మాటలకు భిన్నంగా జమ్ములో ఉగ్రదాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు 683 ఉగ్రదాడులు చోటుచేసుకున్నాయి. 258 మంది జవాన్లు, 170 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు" అని ఖర్గే పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి జమ్ములో 25 ఉగ్రదాడులు జరిగాయని.. 15 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా, 27 మంది గాయపడ్డారని తెలిపారు.

# అమెరికాలో శిక్షణ మొదలుపెట్టిన భారతీయ వ్యోమగాములు


**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లేందుకు .. ఇద్దరు వ్యోమగాములను ఇస్రో తయారు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ ఇద్దరు పైలెట్లు అమెరికా చేరుకున్నారు. హూస్టన్‌లో ఉన్న ప్రైవేటు కంపెనీ ఆక్సియమ్ స్పేస్‌లో వాళ్లు శిక్షణ మొదలుపెట్టారు. గ్రూప్ కెప్టన్ శుభాన్షు శుక్లాతో పాటు గ్రూప్ కెప్టెన్ ప్రశాంత బాలకృష్ణన్ నాయర్ శిక్షణ తీసుకుంటున్నారు. ఈ ఇద్దరూ గగన్‌యాన్ మిషన్‌లో ఉన్నారు. ఆక్సియమ్ స్పేస్, నాసా కెన్నడీ స్పేస్ సెంటర్, స్పేస్ ఎక్స్‌లో శిక్షణ పొందుతారు. గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా .. ప్రైమరీ ఆస్ట్రోనాట్ కాగా, స్పేస్ స్టేషన్ మిషన్ కు గ్రూప్ కెప్టెన్ నాయర్ బ్యాకప్ ఆస్ట్రోనాట్‌గా ఉండనున్నారు. ఆక్సియమ్-4 పేరుతో మిషన్ చేపడుతన్నారు. కొన్ని నెలల పాటు ఆ ఇద్దరికీ శిక్షణ ఉంటుందని ఆక్సియమ్ స్పేస్ ఒక ప్రకటనలో తెలిపింది. 2025లో స్పేస్ స్టేషన్‌కు ఎగిరే అవకాశం వస్తుంది. స్పేస్ స్టేషన్‌లో ఆ వ్యోమగాములు సుమారు 14 రోజులు గడపనున్నారు. శుభాన్షు శుక్లాతో పాటు అమెరికా ఆస్ట్రోనాట్ కమాండర్ పెగ్గీ విట్‌సన్, మిషన్



స్పెషలిస్టు స్లావోజ్ ఉనస్కీ, మరో స్పెషలిస్టు టిబర్ కాపు శిక్షణ పొందుతున్నారు. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను ఫ్లోరిడా నుంచి పంపనున్నారు.

# కేజ్రీవాల్‌కు చుక్కెదురు

- అరెస్టు సమర్థనీయం కాదని చెప్పలేము
- సిబిఐ అరెస్టును సవాల్ చేస్తూ
- దిల్లీ హైకోర్టులో వేసిన పిటిషన్ కొట్టివేత



**దిల్లీ:** మద్య విధానం కేసులో సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ దిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వేసిన పిటిషన్ ను దిల్లీ హైకోర్టు కొట్టివేసింది. అరెస్ట్ సమర్థనీయం కాదని చెప్పలేమని పేర్కొంది. ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది. అలాగే, బెయిల్ పిటిషన్ న్నూ కొట్టివేసింది. దిల్లీ మద్యం విధానం కేసులో తొలుత కేజీవాల్ను ఎన్ఫోర్స్మెంట్ డ్కెరెక్టరేట్ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తర్వాత సుప్రీంకోర్టులో బెయిల్ లభించగా.. కాసేపటికే సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ అరెస్ట్ను సవాలు చేస్తూ దిల్లీ హైకోర్టులో వేసిన పిటిషన్ ను తాజాగా కొట్టివేసిన నేపథ్యంలో కేజీవాల్.. సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు ఆప్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# బంగ్లాదేశ్ సంక్షోభంపై కార్తీ చిదంబరం కీలక వ్యాఖ్యలు



**దిల్లీ:** హింసాకాండతో బంగ్లాదేశ్ అట్టుడికిన నేపథ్యంలో ఆర్మీహెచ్చరికలతో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. ప్రధాని పదవి నుంచి వైదొలగిన అనంతరం ఆమె సోదరితో కలిసి ఢాకా ప్యాలెస్ నుంచి ఆర్మీ హెలికాప్టర్‌లో బంగ్లా మీదుగా భారత్‌కు తరలివెళ్లినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రస్తుతం బంగ్లాలో కర్ఫ్యూ కొనసాగుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో దేశంలో ప్రభుత్వ ఏర్పాటుకు సైన్యం సిద్ధమైంది. లా అండ్ ఆర్డర్ మొత్తం సైన్యం చేతుల్లోకి వెళ్లిపోయింది. త్వరలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న ఆర్మీ చీఫ్ ప్రకటించారు. మరోవైపు దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సైన్యం మొహరించింది. ఇక బంగ్లాదేశ్‌లో పరిస్థితి గాడితప్పడంతో పొరుగు దేశాలపై ప్రభావం గురించి హాట్ డిబేట్ సాగుతున్నది. బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభంపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం స్పందించారు. బంగ్లాలో ప్రస్తుత పరిస్థితి మన సరిహద్దు భద్రతపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది వేచిచూడాలని ఆయన వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్‌లో భారత పౌరులందరూ సురక్షితంగా ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. బంగ్లాదేశ్ నుంచి మన సరిహద్దుల్లోకి శరణార్థుల ప్రవాహం లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. మన దేశ ప్రయోజనాలే ముఖ్యంగా భారత ప్రభుత్వం వెనుక అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉంటాయని కార్తీ చిదంబరం చెప్పారు.



## నా రాజీనామా అడిగే నైతిక హక్కు యెడ్యూరప్పకు లేదు

**బెంగళూరు:** కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పాలన సాగిస్తోందని, సీఎం సిద్ధరామయ్య తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని.. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత యెడ్యూరప్ప చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడి రగిలించాయి. అయితే ఈ వ్యాఖ్యలను సీఎం సిద్ధరామయ్య తీవ్రంగా ఖండించారు. యెడ్యూరప్పపై ఉన్న కేసుల గురించి గుర్తుచేశారు. తన రాజీనామా అడిగే హక్కు ఆయనకు లేదన్నారు. యెడ్యూరప్ప డిమాండ్‌ను ప్రస్తావించిన మీడియాతో సిద్ధరామయ్య మాట్లాడుతూ.. 'యెడ్యూరప్పపై పోక్సో కేసు ఉంది. ఆయనపై ఎన్ని కేసులు ఉన్నాయో మీకు తెలుసా..? ఆయన రాజకీయాల్లో ఉండవచ్చా..? నా రాజీనామా అడిగేందుకు ఆయనకు ఏ నైతిక హక్కు ఉన్నది..? ఆయనపై చార్జిషీట్ దాఖలైంది. కోర్టు బెయిల్ ఇచ్చింది కాబట్టి ఆయన బయట ఉన్నారు. లేదంటే పోక్సో కేసులో జైల్లో ఉండేవారు.' అని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోని 21 కేసులపై తాము విచారణకు ఆదేశించామని, ఆదేవిధంగా మిగతా కేసులలో కూడా విచారణకు ఆదేశిస్తామని సిద్ధరామయ్య వెల్లడించారు.

# బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు చేస్తోంది

## అఖిలేష్ యాదవ్



**లక్నో:** సమాజ్వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ భాజపాపై విమర్శలు గుప్పించారు. అయోధ్య గ్యాంగ్ రేప్ కేసులో ఉత్తరప్రదేశ్లోని భాజపా ప్రభుత్వం కుట్ర పూరిత రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా మతతత్వ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. రిజర్వేషన్లు, దళితులు, గిరిజనులు, మైనారిటీల గురించి ఆలోచించే వారు వెంటనే భాజపాను వీడాలని సూచించారు. ఎన్నికలకు ముందు భాజపా కుట్రపూరిత రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్పై విమర్శలు గుప్పిస్తూ 'యోగి' ఆదిత్యనాథ్కు ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై నమ్మకం లేకపోతే అతడు ఎప్పటికీ 'యోగి' కాలేడు అని అన్నారు. కాగా అయోధ్యలో బాలికపై సామూహిక అత్యాచారం కేసును సుమోటోగా తీసుకొని, నిందితులను శిక్షించాలని, బాధితురాలికి రక్షణ కల్పించాలని ఆయన కోర్టును కోరారు. కొందరు ఈ విషయాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. రెండు నెలల క్రితం అయోధ్యలోని ఓ 12 ఏళ్ల బాలికపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆసుపత్రికి తరలించగా గర్భవతి అని తేలడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో అనుమానితులైన బేకరీ యజమాని మొహిద్ రాజును జూలై 30న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈ ఘటనలో పధాన నిందితుడు మొహిద్ ఖాన్ సమాజ్ వాదీ పార్టీకి చెందిన వాడని సీఎం యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు.

# షేక్ హసీనాతో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ భేటీ

**దిల్లీ:** బంగ్లాదేశ్‌లో హింస చెలరేగడంతో ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు చేరుకున్న షేక్ హసీనాను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్, మిలిటరీకి చెందిన పలువురు ఉన్నతాధికారులు కలిశారు. ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌బేస్‌లో దిగిన హసీనాకు ధోవల్, ఆర్మీ అధికారులు రిసీవ్ చేసుకున్నారు. షేక్ హసీనాకు భారత వైమానిక దళంతోపాటు ఇతర భద్రతా బలగాలు రక్షణ కల్పించనున్నాయి. ప్రస్తుతం ఆమెకు సురక్షితమైన ప్రాంతంలో ఆశ్రయం కల్పించినట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. హిండన్ ఎయిర్‌బేస్‌లో అజిత్ ధోవల్, మిలిటరీ అధికారులతో హసీనా మాట్లాడారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో పరిస్థితి, హసీనా భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితి నేపథ్యంలో తూర్పున ఉన్న ప్రతి సెక్టార్‌లో మిలిటరీ అధికారులు అలర్ట్ ప్రకటించారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల విషయంలో తలెత్తిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దాదాపు 300 మంది మృతిచెందారు. ఈ నేపథ్యంలో బంగ్లా మిలిటరీ సలహా మేరకు హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. ఇక్కడి నుంచి ఆమె లండన్‌కు వెళ్లనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# ఉదయనిధి డిప్యూటీ సీఎం కావడానికి ఇంకా సమయముంది



**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ కు డిప్యూటీ సీఎం పగ్గాలు అప్పగిస్తారని అధికార డీఎంకేలో కొంతకాలంగా జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై స్టాలిన్ తాజాగా స్పందించారు. ఉదయనిధి డిప్యూటీ సీఎం కావడానికి ఇంకా సమయం ఉందన్నారు. ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించాలంటూ పార్టీ నుంచి డిమాండ్ పెరుగుతోందని స్టాలిన్ తెలిపారు. తమిళనాడు యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి మంత్రి, డీఎంకే పార్టీ యూత్ వింగ్ సెక్రటరీ ఉదయనిధి కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆయనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించాలని చాలాకాలంగా పార్టీ నుంచి డిమాండ్ వినిపిస్తోంది. గతంలో స్పందించిన ఉదయనిధి దీనిపై సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# దెబ్బకు దిగొచ్చిన ఎయిర్‌టెల్




**విశ్వంభర, బిజినెస్ :** భారతదేశంలో టెలికం కంపెనీలు ఇటీవల కాలంలో రీచార్జ్ ప్లాన్స్ ధరలు బాగా పెంచాయి. ముఖ్యంగా జియో, ఎయిర్‌టెల్, వీఐ వంటి సంస్థలు ఏకంగా 30 శాతం వరకు ధరలను పెంచాయి. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా వినియోగించే నెలవారీ రీచార్జ్ ధరలు ఇంచుమించు రూ.100 వరకు పెరగడంతో మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ ద్వారా ఇతర నెట్‌వర్క్‌ల వైపు చూస్తున్నారు. ముఖ్యంగా ఎయిర్‌టెల్ వినియోగదారులు పెద్ద సంఖ్యలో ఇతర కంపెనీలకు ఎంఎన్‌పీ వైపు మొగ్గు చూపడంతో ఎయిర్‌టెల్ వినియోగదారులను కాపాడుకునేందుకు దిద్దుబాటు చర్యలను తీసుకుంది. ముఖ్యంగా నెలవారీ రీచార్జ్ ప్లాన్ ధరలను సవరించింది. ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ రెండింట్లో రీచార్జ్ ధరలను సవరించింది. ఎయిర్‌టెల్ కస్టమర్‌లు తమ ఖర్చులను తగ్గించుకోవాలనే లక్ష్యంతో కంపెనీ ఎంట్రీ-లెవల్ ట్రూలీ అన్‌లిమిటెడ్ ప్రీపెయిడ్ ప్లాన్‌తో ముందుకు వచ్చింది. ఈ ప్లాన్ కేవలం రూ. 199కి అందుబాటులో ఉంది. అపరిమిత వాయిస్ కాల్స్‌తో పాటు రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 2 జీబీ డేటా అందిస్తుంది. ఈ ప్లాన్ 28 రోజుల వ్యవధితో వస్తుంది. అలాగే డేటా అయిపోయిన తర్వాత ఒక ఎంబీకు 50 పైసలు వసూలు చేస్తుంది. అలాగే ఈ ప్లాన్ కింద వింక్ మ్యూజిక్, వింక్‌లో ఫ్రీ హలో ట్యూన్స్ వంటి అదనపు ప్రయోజనాలను అందిస్తుంది.

### పోస్ట్ పెయిడ్ ప్లాన్

ఎయిర్‌టెల్ ఎంట్రీ లెవల్ పోస్ట్‌పెయిడ్ ప్లాన్ రిటైల్ కస్టమర్‌లకు నెలవారీ అద్దె రుసుము రూ. 449తో అందుబాటులో ఉంది. ఈ ప్లాన్‌లో అపరిమిత వాయిస్ కాల్స్‌తో పాటు రోజుకు 100 ఎస్ఎంఎస్‌లను అందిస్తుంది. అలాగే 200 జీబీ వరకు రోల్‌ఓవర్‌తో 50 జీబీ నెలవారీ డేటా అందిస్తుంది. అలాగే కస్టమర్‌లు 5 జీ కవరేజీ ఉన్న ప్రాంతాల్లో కాంప్లిమెంటరీ అపరిమిత 5 జీ డేటా ప్రయోజనాన్ని పొందవచ్చు. అలాగే కస్టమర్‌లు ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా 3 నెలల పాటు ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ ప్లే ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను అందిస్తుంది. అలాగే అదనంగా రూ. 349తో ప్లాన్‌కు మరిన్ని కుటుంబ కనెక్షన్‌లను జోడించే అవకాశం కూడా ఉంది.



## అధికారులపై మంత్రి ఉత్తమ్ సీరియస్

**విశ్వంభర, కోదాడ:** తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోదాడలో నీటిపారుదల శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిఫ్ట్ ఇరిగేషన్ల పనితీరుపై పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రైతుల లేవనెత్తిన సమస్యలకు అధికారులు సరైన సమాధానాలు ఇవ్వకపోవడంపై మంత్రి సీరియస్ అయ్యారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఏఈ, డీఈని హెచ్చరించారు. అలాగే, హుజూర్నగర్ డీఈ నవీన్ను సస్పెండ్ చేయాలని కలెక్టర్కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.



# అనుమానాస్పద రిజిస్ట్రేషన్లపై కలెక్టర్లు విచారణ జరిపించాలి

## ఏపీలో రెవెన్యూ రికార్డుల భద్రతపై ఆర్పీ సిసోడియా ఆందోళన

**విశ్వంభర, అమరావతి:** సచివాలయంలో కలెక్టర్ల సదస్సు కొనసాగుతోంది. రెవెన్యూ శాఖపై స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డుల భద్రతపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "అనుమానాస్పద రిజిస్ట్రేషన్లపై కలెక్టర్లు విచారణ జరిపించాలి. రెవెన్యూ కార్యాలయాల్లో భూ రికార్డులు భద్రపరచాలి. సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో డాక్యుమెంట్లు జాగ్రత్త చేయాలి. చాలా కార్యాలయాల్లో సీసీ కెమెరాలు కూడా లేవు. క్షేత్రస్థాయి పిటిషన్లు సీఎం వద్దకు వస్తే కలెక్టర్లు విఫలమైనట్లే. రికార్డులు భద్రపరిచే విషయంలో పోలీసుల సహకారం తీసుకోవాలి" అని కలెక్టర్లకు సూచించారు. "ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో చాలా వరకు రెవెన్యూశాఖవే భూములు లాగేసుకున్నారనే ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయి. పత్రాలు తమ వద్దే ఉన్నా.. భూ వివాదంలో ఉన్నట్టు ఫిర్యాద.. చేస్తున్నారు. కలెక్టర్లు, ఎస్పీలు భూ సమస్యలపై దృష్టిసారించాలి. కలెక్టర్లపై విశ్వాసం సన్నగిల్లకుండా చూసుకోవాలి. కలెక్టర్లు అందుబాటులో ఉండట్లేదు.. కలవట్లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13.59 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేశారు. వీటిలో 25,230 ఎకరాలు రిజిస్ట్రేషన్లు అయిపోయాయి. సేల్, గిఫ్ట్, తనఖా పేర్లతో అనుమానాస్పద రిజిస్ట్రేషన్లు చేశారు. అనుమానాస్పద రిజిస్ట్రేషన్లపై కలెక్టర్లు విచారణ చేయాలి. అనర్హులకు అసైన్డ్ భూములు కట్టబెట్టారు. కొందరికి తక్కువ దరకే ఇచ్చారు" అన్నారు.

### నెల రోజుల్లో మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు : ఎంకే మీనా

ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్డీపీఎల్ లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా నిఘా పెట్టాలన్నారు. "ఇతర రాష్ట్రాల సరిహద్దులు ఉన్న జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు మరింత నిఘా పెట్టాలి. ఎన్నికల వేళ అక్రమ మద్యం ఎక్కడికి వెళ్లిందో అందరూ చూశారు. నెల రోజుల్లో మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపుల విధానం వస్తుంది" అన్నారు.

### దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: హిమాన్షు శుక్లా

పౌరసంబంధాల శాఖపై ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా ప్రజెంటేషన్ ఇచ్చారు. వార్తల విశ్లేషణ కోసం ఏఐ టూల్ను సీఎంకు చూపించారు. "సమాచార యుద్ధం ఫీల్డ్ నుంచి ఫీడ్ వరకు వచ్చింది. దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది. ఏది నిజం.. ఏది దుష్ప్రచారం అనేది ప్రజలకు తెలపాలి. జిల్లా స్థాయిలో మీడియా మానిటరింగ్ టీమ్లు ఉండాలి. ప్రభుత్వంపై దుష్ప్రచారం జరిగితే తిప్పికొట్టే వ్యవస్థ ఉండాలి" అన్నారు.

# మనమంతా కష్టపడితే 2047నాటికి నంబర్ వన్

## కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



**అమరావతి:** గత ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలనతో అందరూ నష్టపోయారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా అధికారులంతా ముందుకెళ్లాల్సిన అవసరముందని చెప్పారు. వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడారు. "మనం తీసుకునే నిర్ణయాల వల్ల వ్యవస్థలే మారే పరిస్థితి ఉంటుంది. మంచి నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుంది. మనమంతా కష్టపడితే 2047 నాటికి ప్రపంచంలోనే మనం నంబర్ వన్గా ఉంటాం. ఈ కలెక్టర్ల సదస్సు చరిత్ర తిరగరాయబోతోంది. ప్రజావేదికలో ఆనాటి సీఎం కలెక్టర్ల సదస్సు పెట్టి కూలగొట్టేశారు. విధ్వంసంతో పాటు పనిచేసే అధికారులను పక్కనబెట్టారు.. బ్లాక్ మెయిల్ చేశారు. బ్రాండ్ ఏపీని దెబ్బతీసేలా గత ఐదేళ్ల పాలన సాగింది. ఒకప్పుడు ఆంధ్రా అధికారులంటే ఢిల్లీలో ఒక గౌరవం ఉండేది. ఇప్పుడు చులకన భావం కలిగే పరిస్థితిని తీసుకొచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి అధికారులంతా అంకితం కావాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో'..

పేదరిక నిర్మూలనకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమంలో అధికారులు పాల్గొని ప్రజలతో అన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో కార్యక్రమంలో అధికారులు పాల్గొని ప్రజలతో మమేం కావాలని దిశానిర్దేశం చేశారు. పేదరిక నిర్మూలనకు వినూత్న ఆలోచనలతో కలెక్టర్లు ముందుకు రావాలన్నారు. పార్టీ ఆఫీస్ కి వెళ్లేటపుడు పెద్ద ఎత్తున ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని.. 5వేల ఫిర్యాదుల్లో సగం భూ సమస్యలే ఉన్నాయని చెప్పారు. జగన్ పాలనలో పెద్ద ఎత్తున భూ కబ్జాలు, అవకతవకలు జరిగాయన్నారు. సర్వే రాళ్లు, పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో వేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచన గతంలో చూశామని వివరించారు.

### రీచ్ నుంచి తక్కువ ఛార్జీతో ఇసుక వచ్చేలా చేయాలి..

ఇసుక, మైనింగ్ వ్యవహారాల్లో ఇబ్బందులు తొలగించాలని అధికారులకు సీఎం సూచించారు. ఉచిత ఇసుక విధానం అమల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. " కేవలం ఇసుక తవ్వకం, రవాణాకే ఛార్జీలు వసూలు చేయాలి. రవాణా ఛార్జీలు పెరగకుండా అతి దగ్గరగా ఇసుక రీచ్ పెట్టాలి. ఎప్పటికప్పుడు రవాణా ధర ప్రజలకు తెలియాలి. అధికారులెవరైనా సరైన నిర్ణయం తీసుకోకపోతే వారిని అక్కణ్నుంచి తప్పిస్తా.. సచివాలయంలో ఇసుక బుకింగ్ చేస్తే రవాణా ఛార్జీలే చెల్లించేలా ఉండాలి. ఇసుక రీచ్ నుంచి ఇంటి వరకు తక్కువ ఛార్జీతో ఇసుక వచ్చేలా ఉండాలి. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించవద్దు. సహజ వనరుగా వచ్చిన ఇసుకను ఇష్టానుసారంగా దోపిడీ చేశారు. సుప్రీంకోర్టు చెప్పినా మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఇసుక విషయంలో చాలా అక్రమాలు జరిగాయి. వాటిపై సీఐడీ విచారణ చేస్తున్నాం. నిందితులను శిక్షిస్తాం. భూగర్భ జలాలను పెంచుకునేలా మనం ప్రయత్నం చేయాలి. చెక్ డ్యామ్లకు మరమ్మతులు చేయాలి. ముందుగా అన్ని రిజర్వాయర్లు, చెరువులను పూర్తిగా నింపండి. గత ప్రభుత్వం గేట్ల మరమ్మతులకు డబ్బులివ్వకుండా నిర్లక్ష్యం చేసింది" అని చంద్రబాబు అన్నారు.

### 80 శాతం రెవెన్యూ సమస్యలే: మంత్రి అనగాని

ప్రజల నుంచి వస్తున్న సమస్యల్లో 80 శాతం రెవెన్యూ సంబంధిత అంశాలేనని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆ శాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని చెప్పారు. స్వార్థం కోసం గత పాలకులు ఎన్నో అరాచకాలు చేశారన్నారు. అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయని తెలిపారు. నిర్వీర్యమైన వ్యవస్థలను చక్కదిద్దాల్సిన అవసరముందన్నారు. ప్రజల హక్కులన్నీ నిర్వీర్యం చేసే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించ బోతున్నట్లు చెప్పారు.

# యువతిపై ప్రేమోన్మాది దాడి



**విశ్వంభర, గుంటూరు :** ప్రేమోన్మాది యువతి పైదాడికి పాల్పడిన సంఘటన గుంటూరు జిల్లా తాడేపల్లి ఎయిమ్స్ కు వెళ్లే రహదారి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. తాడే పల్లి పోలీసులు వివరాల ప్రకారం.. జాతీయ రహదారి ఎయిమ్స్ రోడ్డు వద్ద ప్రేమోన్మాది యువతిని బ్లేడ్తో గొంతు కోసేందుకు ప్రయ త్నించాడని తెలిపారు. గొంతుపై గాయాలు కాగా యువతి అప్రమత్తం కావటంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఘటనా స్థలంలో ఉన్న స్థానికులు అడ్డుపడి నిందితులను పట్టుకుని తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. బాధితురాలని చికిత్స నిమిత్తం మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. అవనిగడ్డకు చెందిన బాధితురాలు ఓ ప్రైవేట్ వైద్యశాలలో నర్సుగా పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే గత కొంతకాలంగా విజయవాడకు చెందిన క్రాంతి అనే యువకుడు ప్రేమిస్తున్నానని చెప్పి ఆమె వెంట పడుతున్నట్లు తెలిపారు. అయితే ఆమె అతని ప్రేమను తిరస్కరించడంతో బ్లేడుతో చంపటానికి ప్రయత్నించాడని సమాచారం. స్థానికులు అప్రమత్తం కావడంతో యువతి ప్రాణాలతో బయటపడింది. తాడేపల్లి పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# సైబర్ నేరాలపై సీపీ నజర్



**విశ్వంభర, విజయవాడ :** నేరాలు జరిగిన తర్వాత దర్యాప్తు కంటే జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి రాజ శేఖర్ బాబు తెలిపారు. సమాజంలో వివిధ రకాల సైబర్ నేరాలు జరుగుతూ ఉంటాయని అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వెయవచ్చని తెలిరారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తే ఆ నేరాల బారిన పడకుండా ఉంటారని అన్నారు. ఈ సైబర్ నేరాలను అంతం చేయాలనే ప్రధాన ఉద్దేశ్యంతో సీపీ ఆధ్వర్యంలో పోలీస్ కమీషనరేట్ పరిదిలోని పోలీస్ సిబ్బందిని, మహిళా పోలీసులను సైబర్ కమాండోలుగా ఏర్పాటు చేశారు.

ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చేందుకు వినూత్న పద్దతిలో ముందుకు పోవడానికి ఈ సైబర్ కమాండోలను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. ఇప్పటికే కమీషనరేట్ పరిదిలో అన్ని కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి వారిలో ఆసక్తి కలిగిన వారిని సైబర్ సోల్జర్స్‌గా నమోదు చేశారు. ప్రతి సైబర్ కమాండోకు 10-15 మంది సోల్జర్స్‌ను ఇవ్వడం జరుగుతుందని ఆ కమాండోలు సోల్జర్స్ కు గైడ్ చేస్తూ వారు ఎక్కువ మంది ప్రజలను సైబర్ సిటిజన్లుగా మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు. కమాండోలకు సైబర్ నేరాలు అనేవి ఆన్ లైన్ లో గేమ్స్, ఆన్ లైన్ లోన్స్, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, పార్ట్ టైం జాబ్స్ అంటూ వాట్సాప్ ద్వారా, పేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, టెలిగ్రాం మొదలైన యాప్‌ల ద్వారా ఫేక్ ఐడీలు, మెసేజ్ రూపంలో వచ్చే లింకులు, బ్యాంక్ కేవైసీ అప్‌డేట్, ఓఎల్ఎక్స్ నుంచి ఆర్మీ అధికారులము అని చెప్పి తక్కువ రేట్‌కు వస్తువులు అమ్ముతున్నట్లు చూపించడం, ఢిల్లీ, ముంబాయి పోలిసులము అని చెప్పి తప్పుడు కాల్స్ చేయడం ద్వారా, కస్టమర్‌కేర్ ద్వారా వచ్చే కాల్స్‌తో ఏ విధంగా ప్రజలు సైబర్ నేరాల భారిన పడతారు అనే విషయాలపై పూర్తిగా అవగాహన కల్పించారు.



# హైకోర్టును ఆశ్రయించిన జగన్

**విశ్వంభర, అమరావతి :** తనకు వ్యక్తిగత భద్రత తగ్గించారంటూ వైసీపీ అధినేత జగన్ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తనకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి సెక్యూరిటీని కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ జగన్ పిటిషన్ దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా తన భద్రతను తొలగించిందని, తనను అంతమొందించే లక్ష్యంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని జగన్ తన పిటిషన్ లో ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉన్న విషయాన్ని పరిశీలించకుండానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం తగదని పేర్కొన్నారు. అయితే, జగన్ కు భద్రత తగ్గించారన్న వాదనలను పోలీసు శాఖ, రాష్ట్ర ప్రభుత్వం కొట్టిపారేశాయి. నిబంధన మేరకే జగన్ కు భద్రత కేటాయించామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. జగన్‌కు జడ్ ప్లస్ సెక్యూరిటీ కొనసాగుతుందని తెలిపాయి. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు అదనంగా కల్పించే భద్రతనే ఇప్పుడు తగ్గించామని పోలీసు శాఖ వెల్లడించింది. జగన్ కు ఇప్పుడు సీఎం హోదా భద్రత ఇవ్వడం కుదరదని అధికారులు తేల్చిచెప్పారు. కాగా, జూన్ 3వ తేదీ నాటికి తనకు 900 మంది పోలీసులతో భద్రత ఉండేదని, ఇప్పుడు కూడా అదే భద్రత కావాలని జగన్ తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. జగన్ కు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా సరిగా లేదని తెలిపారు.

# శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్

**విశ్వంభర, తిరుపతి :** తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి తిరుమలకు వస్తుంటారు. మరీ ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఏడాదిలో ఒక్కసారైనా శ్రీవారిని దర్శించుకోవాలని కోరుకునే వారు చాలా మంది ఉంటారు. అయితే దర్శనం టికెట్స్ ముందుగా లభించకనో, రూమ్స్ అందుబాటులో లేకో ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారికోసమే ఐఆర్‌సీటీసీ మంచి టూర్ ప్యాకేజీలను అందిస్తోంది. ముఖ్యంగా త్వరగా టూర్‌ను కంప్లీట్ చేయాలనుకునే వారికోసం ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఎయిర్ టూర్ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఈ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయని మనకు తెలిసిందే. అయితే తాజాగా విశాఖపట్నం నుంచి కూడా ఐఆర్‌సీటీసీ ఈ టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఆగస్టు 9, 23వ తేదీల్లో ఈ టూర్ అందుబాటులో ఉంది. ఇంతకీ ఈ ప్యాకేజీలో ఏయే ప్రాంతాలు కవర్ అవుతాయి.? ప్యాకేజీ ధర ఎంత.? లాంటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

### టూర్ ఇలా సాగుతుంది..

మొదటి రోజు విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ నుంచి ఉదయం 10.20 గంటలకు విమానం బయలుదేరుతుంది. మధ్యాహ్నం 12.10 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి హోటల్‌లో తీసుకెళ్తారు. ఫ్రెషప్ అయిన తర్వాత భోజనం ముగించుకొని కాణిపాకం, శ్రీనివాస మంగాపురం ఆలయాల సందర్శన ఉంటుంది. తిరిగి హోటల్‌కు చేరుకున్న తర్వాత భోజనం చేసి రాత్రి హోటల్‌లోనే బస ఉంటుంది. రెండో రోజు ఉదయం టిఫిన్ చేయగానే తిరుమల వెంకటేశ్వర స్వామి శీఘ్రదర్శనం ఉంటుంది. దర్శనం పూర్తి కాగానే లంచ్ చేసిన తర్వాత శ్రీకాళహస్తి, తిరుచానూరు ఆలయాల దర్శనం ఉంటుంది. తిరిగి మళ్లీ సాయంత్రం హోటల్‌కు చేరుకుంటారు. రాత్రి తిరుపతి హోటల్‌లోనే బస ఉంటుంది. ఇక మూడో రోజు ఉదయం టిఫిన్ చేసిన తర్వాత హోటల్ నుంచి చెకవుట్ చేస్తారు. అనంతరం గోవింద రాజస్వామి దేవాలయం, ఇస్కాన్ ఆలయాలను సందర్శన ఉంటుంది. మధ్యలోనే భోజనం చేసిన తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. సాయంత్రం 5 గంటలకు విశాఖకు తిరుపతి నుంచి విమానం బయలు దేరుతుంది. సాయంత్రం 6:35 గంటలకు విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు చేరుకోవడంతో టూర్ ముగుస్తుంది.



### ప్యాకేజీ ధర వివరాలు..

ప్యాకేజీ ధర విషయానికొస్తే.. సింగిల్ ఆక్యుపెన్సీ ప్రారంభ ధర రూ. 23,565, డబుల్ ఆక్యుపెన్సీ రూ. 20,195, ట్రిపుల్ ఆక్యుపెన్సీ రూ. 20,000, చైల్డ్ విత్ బెడ్ రూ. 18,375, చైల్డ్ వితవుట్ బెడ్ ధర రూ. 17,880గా నిర్ణయించారు.

# గుర్తుతెలియని శవం లభ్యం

**విశ్వంభర, వెల్దండ :** గుర్తు తెలియని శవం వెల్దండ మండలం మహాత్మా గాంధీ కాలనీ తాండ గ్రామపంచాయతీ శివారులో లభ్యమైంది. చనిపోయిన వ్యక్తి వయస్సు సుమారు అరవై నుంచి అరవై ఐదు సంవత్సరాల వయసు ఉంటుందని , మృతదేహము కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్టుగా పోలీసులు గుర్తించారు. ఇట్టి మృతదేహానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు 8712657756, 8712657755 ఈ ఫోన్ నెంబర్ల ద్వారా తెలుపగలరని వెల్దండ ఎస్సై కురుమూర్తి తెలిపారు.

# ఒకేసారి ఐపీఎల్, పీఎస్ఎల్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ అత్యంత విజయవంతంగా నిలవడం వల్ల చాలా దేశాలు ఈ టీ20 లీగ్‌ను అనుసరించాయి. అలా మొదలైన వాటిల్లో పాకిస్థాన్ సూపర్ లీగ్ కూడా ఒకటి. అయితే వచ్చే ఏడాది పీఎస్ఎల్, ఐపీఎల్ మధ్య క్లాష్ జరిగే అవకాశముందని అంటున్నారు. పాకిస్థాన్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ కారణంగా వచ్చే ఏడాది ఐపీఎల్ తేదీలు, పీఎస్ఎల్ తేదీలు క్లాస్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పాకిస్థాన్ సూపర్ లీగ్ సాధారణంగా ఫిబ్రవరి, మార్చి నెలలో జరుగుతుంది. ఐపీఎల్ మార్చి చివరిలో ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరం కూడా పీఎస్ఎల్ ఫిబ్రవరి 17 నుంచి మార్చి 18 వరకు నిర్వహించారు. 2024 ఐపీఎల్ సీజన్ మార్చి 22 నుంచి మే 26 వరకు జరిగింది. అయితే, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, పీఎస్ఎల్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్ 10 నుంచి మే 25 మధ్య నిర్వహించవచ్చని సంకేతాలు ఇస్తోంది. పాకిస్థాన్ ఇంటర్నేషనల్ మ్యాచ్‌లకు ఇబ్బంది కలగకుండా పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను రీషెడ్యూల్ చేయాలని ఈ నిర్ణయం తీసుకుందట. ఒకవేళ ఇదే జరిగి ఐపీఎల్‌తో క్లాష్ అయితే రెండు లీగ్స్‌లో ఆడే ఇంటర్నేషనల్ ప్లేయర్స్, బ్రాడ్‌కాస్ట్ వ్యూవర్‌షిప్, స్పాన్సర్స్‌పై ప్రభావం పడుతుంది. ఇకపోతే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, పాకిస్థాన్ సూపర్ లీగ్‌కు సంబంధించి తాత్కాలిక షెడ్యూల్‌ను ప్రకటించడంతో పాటు దేశీయ ఆటగాళ్లకు నెలవారీ వేతనాలలో మార్పులు కూడా చేసింది.






**పాకిస్థాన్ సూపర్ లీగ్ 2025 షెడ్యూల్..**

బంగ్లాదేశ్‌తో హెూమ్ సిరీస్: 2024 ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 3 వరకు రెండు టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతుంది.
ఇంగ్లాండ్‌తో హెూమ్ సిరీస్: 2024 అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 28 వరకు మూడు టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతుంది.
ఆస్ట్రేలియా పర్యటన: 2024 నవంబర్ 4 నుంచి నవంబర్ 18 వరకు మూడు వన్డేలు, మూడు టీ20లకు ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది.

**జింబాబ్వే పర్యటన:** 2024 నవంబర్ 24 నుంచి నుండి డిసెంబర్ 5 వరకు మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం జింబాబ్వే వెళ్తుంది.

**దక్షిణాఫ్రికా పర్యటన:** 2024 డిసెంబర్ 10 నుంచి 2025 జనవరి 7 వరకు మూడు టీ20లు, మూడు వన్డేలు, రెండు టెస్ట్ మ్యాచ్‌లు ఆడేందుకు సుదీర్ఘకాలం దక్షిణాఫ్రికాలో పర్యటిస్తుంది.

**వెస్టిండీస్‌తో హెూమ్ సిరీస్:** 2025 జనవరి 16 నుంచి రెండు టెస్ట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి.

**స్వదేశంలో ట్రై-సిరీస్:** 2025 జనవరి 16 నుంచి ఫిబ్రవరి 14 వరకు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో ట్రై సిరీస్‌లో పాల్గొంటుంది.

**పాకిస్థాన్‌లో 2025 ఛాంపియన్స్ ట్రోఫీ:** ఇంకా తేదీలు ప్రకటించాల్సి ఉంది. ట్రై-సిరీస్ పూర్తయ్యాక ఛాంపియన్స్ ట్రోఫీ జరగవచ్చు.

**న్యూజిలాండ్ పర్యటన:** 2025 మార్చి 16 నుంచి ఏప్రిల్ 5 వరకు ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడుతుంది.



# సచిన్ రికార్డు బద్దలు కొట్టిన రోహిత్ శర్మ

**విశ్వంభర, స్పోర్ట్స్ :** శ్రీలంకతో జరుగుతున్న రెండో వన్డేలోనూ భారత కెప్టెన్ రోహిత్ శర్మ సూపర్ ఇన్నింగ్స్ తో అదరగొట్టాడు. వరుస రెండో హాఫ్ సెంచరీ కొట్టడంతో పాటు భారత లెజెండరీ ప్లేయర్ సచిన్ టెండూల్కర్ రికార్డును సైతం బ్రేక్ చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన భారత ఓపెనర్‌గా సచిన్(120) పేరిట ఉన్న రికార్డును రోహిత్ శర్మ(121) బ్రేక్ చేశారు. తాజాగా శ్రీలంకతో జరిగిన రెండో వన్డేలో ఈ ఘనతను అందుకున్నారు. అలాగే వన్డేల్లో తొలి పది ఓవర్లలోపు అత్యధిక ఫిఫ్టీలు కొట్టిన భారత బ్యాటర్ల లిస్టులో హిట్‌మ్యాన్(4) రెండో స్థానంలో ఉన్నారు. సెహ్వాగ్(7) తొలి స్థానంలో కొనసాగుతున్నారు. శ్రీలంకపై భారత్ ఓటమిని అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ ఒక్కడే పోరాడుతున్నా మిగతా బ్యాటర్లు చేతులెత్తేస్తున్నారు. తొలి వన్డేలో 75/0తో పటిష్ఠ స్థితిలో నిలిచిన టీమ్ ఇండియా 230కి ఆలౌటైంది. రెండో వన్డేలో 97/0 నుంచి 208కే చాప చుట్టేసింది.



# గాయం వేధిస్తున్నా పోరాడిన భారత స్టార్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** పారిస్ ఒలింపిక్స్‌లో భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ లక్ష్యసేన్ పోరాటం ముగిసింది. కాంస్య పతక పోరులో లక్ష్యసేన్ మలేషియాకు చెందిన జెడ్ జే లీ చేతిలో 21-13, 16-21, 11-21 తేడాతో ఓడిపో యాడు. ఈ పోరులో తొలి గేమ్ అలవోకగా నెగ్గిన సేన్ రెండు, మూడు గేమ్‌లలో మాత్రం చేతులెత్తేశాడు. కాగా, కుడి మోచేయికి గా యం వేధిస్తున్నా ఈ పోరులో గెలుపు కోసం పోరాడాడు లక్ష్యసేన్. దీంతో ఈ మ్యాచ్‌లో భారత్‌కు పతకం రాకపోయినప్పటికీ లక్ష్యసే న్ పోరాటం ఆకట్టుకుంది. వాస్తవానికి తొలి సెట్‌లో ప్రారంభం నుంచి దూకుడుగా ఆడిన లక్ష్యసేన్ రెండో సెట్‌లో కాస్త డీలాపడ్డాడు. అదే సమయంలో పుంజుకున్న లీ జిజియా రెండో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇకపోతే ప్రస్తుత ఒలింపిక్స్‌లో ఇప్పటివరకు భారత్ మూడు పతకాలు సాధించిన సంగతి తెలిసిందే.

# భారత హాకీ జట్టుకు షాక్

## సెమీస్‌కు డిఫెండర్ అమిత్ దూరం



**విశ్వంభర, స్పోర్ట్స్ :** పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు అదరగొడుతోంది. ప్రిక్వార్టర్స్‌లో బ్రిటన్ ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది. అయితే.. సెమీస్ చేరుకున్న ఆనందంలో ఉన్న భారత జట్టుకు గట్టి షాకిచ్చింది ఒలింపిక్ కమిటీ. కీలక ఆటగాడు అమిత్ రోహిదాస్ పై ఓ మ్యాచ్ నిషేధం విధించింది. దీంతో అతడు సెమీస్‌లో ఆడే వీలులేకుండా పోయింది. అతడు లేకుండా మంగళవారం జర్మనీతో జరగనున్న సెమీస్‌లో భారత్ ఆడాల్సి ఉంది. ఇది భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బగానే చెప్పవచ్చు. దీనిపై భారత హాకీ సమాఖ్య స్పందించింది. ఇలాంటి ఘటనలతో ప్లేయర్లలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉందని అంది. బ్రిటన్‌తో జరిగిన మ్యాచులో రిఫరీల నిర్ణయాలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. రోహిదాస్ సస్పెన్షన్ పై మండిపడింది. ఈ నిర్ణయాన్ని అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్‌లో సవాల్ చేసింది. అయితే దీనిపై అంతర్జాతీయ హాకీ సమాఖ్య విచారణ చేసి సోమవారం రోజున నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. ఆదివారం బ్రిటన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచులో అమిత్ దాస్‌కు అంపైర్ రెండ్ కార్డు ఇచ్చాడు. మ్యాచ్ 17వ నిమిషంలో ఈ డిఫెండర్ రోహిదాస్ బంతితో పాటుగా వెళ్లే ప్రయత్నం చేయగా వెనకాల నుంచి వచ్చిన బ్రిటన్ ఆటగాడు అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో రోహిత్ దాస్ స్టిక్ పొరబాటున ప్రత్యర్థి ఆటగాడికి తగిలింది. వెంటనే రిఫరీ అమిత్ రోహిదాస్‌కు రెడ్ కార్డు ఇచ్చాడు. దీంతో భారత్ 40 నిమిషాల పాటు 10 ఆటగాళ్లతోనే ఆడింది. ఈ క్రమంలోనే అమిత్ దాస్‌పై ఓ మ్యాచ్ నిషేధం విధించారు.

# టేబుల్ టెన్నిస్‌లో చరిత్ర సృష్టించిన భారత మహిళలు



**విశ్వంభర, స్పోర్ట్స్ :** పారిస్ ఒలింపిక్స్‌లో టేబుల్ టెన్నిస్ టీమ్ ఈవెంట్‌లో భారత్ క్వార్టర్స్‌కు చేరింది. ప్రిక్వార్టర్స్‌లో 3-2 తేడాతో రొమేనియాపై గెలుపొందింది. దీంతో మనికా బాత్రా, ఆకుల శ్రీజ, అర్చనా కామత్‌లతో కూడిన భారత త్రయం ఒలింపిక్స్‌లో టేబుల్ టెన్నిస్ మహిళల టీమ్ ఈవెంట్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్న తొలి భారత జట్టుగా రికార్డ్ సాధించారు. ముందుగా డబుల్స్‌లో ఆకుల శ్రీజ, అర్చనా కామత్ జోడీ అద్భుతంగా ఆడి మూడు గేమ్‌ల్లోనూ ఆధిక్యంలో నిలిచింది. 11-9, 12-10, 11-7తో దయాకోను, సమర ఎలిజబెటాను ఓడించడం వల్ల భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత సింగిల్స్ మొదటి మ్యాచ్‌లో మనికా బాత్రా చెలరేగిపోయింది. 11-5, 11-7, 11-7తో బెర్నాడెట్టేను చిత్తు చేసింది. ఆ తర్వాత రొమేనియా పుంజుకొని వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి 2-2తో స్కోరును సమం చేసింది. హెూరాహెూరీగా సాగిన సింగిల్స్ రెండో మ్యాచ్‌లో శ్రీజ 11-8, 4-11, 11-7, 6-11, 8-11 ఎలిజబెటా చేతిలో పోరాడి ఓటమిని చవిచూసింది. మూడో మ్యాచ్‌లో అర్చనా కామత్ 5-11, 11-8, 7-11, 9-11 బెర్నాడెట్టే చేతిలో ఓడిపోయింది.




# ఇండిగో నయా సర్వీస్

**విశ్వంభర, బిజినెస్ :** దేశంలోనే అతిపెద్ద ఎయిర్ లైన్ సంస్థ 'ఇండిగో' ఈ ఆర్థిక సంవత్సరం చివరికల్లా ఏడు కొత్త అంతర్జాతీయ మార్గాల్లో విమాన సర్వీసులను ప్రారంభించనుంది. ఇండిగో 18వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ విషయాన్ని కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ వెల్లడించారు. ఈ ఏడాది నవంబరు రెండో వారం నాటికి ఇండిగో కంపెనీ మన దేశంలోని 12 మార్గాల్లో నడిచే విమానాల్లో బిజినెస్ క్లాస్ సీట్లను అందుబాటులోకి తీసుకురానుంది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఎంపిక చేసిన మార్గంలో నడిచే విమానాల్లో బిజినెస్ క్లాస్ సీట్లు ఉంటాయి. ఈ సీట్ల బుకింగ్స్ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయని కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ వెల్లడించారు. 'ఇండిగో బ్లూ చిప్' పేరుతో కస్టమర్ లాయల్టీ ప్రోగ్రాంను ఇండిగో లాంఛ్ చేయనుంది. వచ్చే ఏడాది మార్చి 31 లోగా కొత్త అంతర్జాతీయ మార్గాల్లో ఇండిగో విమాన సర్వీసులు మొదలవుతాయని పీటర్ ఎల్బర్స్ తెలిపారు. మరో ఏడు కొత్త మార్గాల్లో సర్వీసులు మొదలైతే, ఇండిగోకు చెందిన ఇంటర్నేషనల్ విమాన సర్వీసులు అందుబాటులో ఉన్న రూట్ల సంఖ్య 40 దాటుతుంది.
ప్రస్తుతం 33 విదేశీ నగరాలకు ప్రతిరోజూ 2వేలకు పైగా ఇండిగో విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ప్రయాణికులను 120 గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. కొత్తగా అందుబాటులోకి రానున్న విదేశీ మార్గాల్లో శ్రీలంకలోని జాఫ్నా కూడా ఉంది. దేశీయ విమానయాన సర్వీసులలో ఇండి గో మార్కెట్ వాటా 61 శాతంగా ఉంది. ప్రస్తు తానికి టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిర్ ఇండి యా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, విస్తారాకు చెందిన విమానాల్లో బిజినెస్ క్లాస్ సీట్లు అందు బాటులో ఉన్నాయి. జూన్ నెలాఖరు నాటికి ఇండిగో కంపెనీ వద్ద దేశీయ విమానయాన సేవల కోసం 382 విమానాలు ఉన్నాయి. వీటిలో 18 విమానాలు లీజుపై తీసుకున్నవి. ఇండిగో కంపెనీ వచ్చే ఏడాది A321 XLR విమానాలను, 2027 నాటికి A350 విమానాలను అందుకోనుంది.

# ప్రపంచ మార్కెట్ల దెబ్బకు సూచీలు ధమాల్

## రూ.15లక్షల కోట్లు ఆవిరి



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఆరంభంలోనే 2,400 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్ను ఆరంభించిన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 2600 పాయింట్ల వరకు నష్టాల్లోకి జారుకుంది. నిఫ్టీ 24,300 దిగువన ఖాతా తెరిచిన నిఫ్టీ.. ఓ దశలో 24 వేల స్థాయిని కోల్పోయింది. ఆఖర్లో కాస్త కోలుకుని 24 వేల ఎగువన ముగిసింది. దలాల్ స్ట్రీట్లో ఒక్కసారిగా ఏర్పడిన కుదుపు కారణంగా రూ.15 లక్షల కోట్లు ఆవిరైంది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.457 లక్షల కోట్ల నుంచి రూ.442 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ ఉదయం 78,588.19 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,981) పాయింట్ల వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78.295 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 2,222.55 పాయింట్ల నష్టంతో 78,759.40 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 662 పాయింట్ల నష్టంతో 24,055 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.02గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌యూఎల్, నెస్లే ఇండియా షేర్లు మాత్రమే లాభాల్లో కొనసాగడం గమనార్హం. టాటా (7.32%), (5.93%), (5.31%), 2 (4.34%), 12%ఇ%షన్ (4.19%) ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.35 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,465 డాలర్ల స్థాయిలో కొనసాగుతోంది.

### బేర్ పట్టుకు కారణాలు..

అమెరికాలో మాంద్యం భయాలు: అమెరికాలో జులై నెలలో ఉద్యోగాల కల్పన అంచనాల కంటేనెమ్మదించింది. దీంతో మాంద్యం ముంచుకొస్తుందనే ఊహాగానాలు బలపడ్డాయి. వ్యవసాయేతర రంగాల్లో జులై నెలలో 1.14 లక్షల ఉద్యోగాలు మాత్రమే నమోదైనట్లు అక్కడి లేబర్ డిపార్ట్మెంట్ వెల్లడించింది. వాస్తవానికి ఇది 1.75 లక్షల వరకు ఉండొచ్చని ముందుగా అంచనా వేశారు. జనాభా వృద్ధికి అనుగుణంగా ఉపాధి అవకాశాలను కల్పించాలంటే ఈ సంఖ్య 2లక్షల వరకు ఉండాలని గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవంగా ఆ సంఖ్య చాలా దిగువన ఉండటంతో మాంద్యం రావొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. మరోవైపు అక్కడ నిరుద్యోగిత రేటు 4.3 శాతానికి చేరుకుంది.

**జపాన్లో అమ్మకాలు :** బ్యాంక్ ఆఫ్ జపాన్ ఇటీవల వడ్డీరేట్లను 0.25 శాతం పెంచింది. అలాగేబాండ్ల కొనుగోళ్లను తగ్గించింది. ఫలితంగా అక్కడి కరెన్సీ యెన్ బలపడింది. దీంతో నష్టాలను నివారించడం కోసం మదుపర్లు తమ వాటాలను విక్రయించడం ప్రారంభించారు. ఫలితంగా సాక్స్ లో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీని ప్రభావం ఆసియా సహా మొత్తం ప్రపంచ మార్కెట్లపై కనిపించింది. జపాన్ నికాయ్ సూచి సోమవారం ఓ దశలో 14 శాతానికి పైగా కుంగింది. ఇతర ప్రపంచ మార్కెట్లూ అదే బాటలో కొనసాగాయి.

**భౌగోళిక ఉద్రిక్తతలు:** భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సైతం మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఘర్షణపూరిత వాతావరణం ఎప్పుడు భగ్గుమంటుందోనని మార్కెట్లు ఆందోళన చెందుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం.. సోమవారమే ఇజ్రాయెల్పై ఇరాన్ దాడి చేయొచ్చని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ జీ7 దేశాలకు సమాచారమిచ్చారు. చమురుకు కేంద్రమైన పశ్చిమాసియాలో నెలకొన్న ఈ యుద్ధ వాతావరణం ఎప్పుడు ఏ రూపం దాలుస్తుందోనని ప్రపంచ దేశాలు భయభ్రాంతులకు గురవుతున్నాయి.
లి అధిక విలువలకు స్టాక్స్: గతవారం భారత మార్కెట్ సూచీలు రికార్డు గరిష్ఠాలను తాకాయి.బఫెట్ ఇండికేటర్ పిలిచే మార్కెట్ క్యాప్, జీడీపీ నిష్పత్తి రికార్డు గరిష్ఠమైన 150 శాతానికి చేరింది. దీంతో అనేక కంపెనీల స్టాక్స్ అధిక విలువల వద్ద ట్రేడవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి స్థిరీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ మేరకు మార్కెట్లో దిద్దుబాటు తప్పకపోవచ్చునని వివరించారు.

**ఉత్సాహపర్చని త్రైమాసిక ఫలితాలు:** ఇప్పటి వరకు వెలువడ్డ వివిధ కంపెనీల త్రైమాసిక ఫలితాలకు అనుగుణంగానే ఉన్నాయి. కానీ, ఎక్కడా మార్కెట్లను ఉత్సాహపరిచేంతటి పాజిటివ్ న్యూస్ లేకపోవడం గమనార్హం.

# యాంకర్ సుమను పబ్లిక్‌గా ముద్దు పెట్టుకున్న నటుడు

## వైరల్ అవుతున్న వీడియో



**విశ్వంభర, సినిమా:** తమిళ హీరో విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం తంగలాన్. ఈ సినిమాకు 'కబాలి', 'కాలా', 'సర్పట్ట పరంపర' చిత్రాల ఫేమ్ పా. రంజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొతు ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తుండగా.. 'సర్పట్ట పరంపర' ఫేమ్ పశుపతి, హాలీవుడ్ నటుడు డానియెల్ కల్టగిరోన్ కీ రోల్స్ పోషిస్తున్నారు. ఈ చిత్రం ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు చిత్రంబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను తెలుగులో భారీ ఎత్తున్న నిర్వహించారు. ఇక ఈ వేడుకకు విక్రమ్‌తో పాటు దర్శకుడు పా.రంజిత్ తదితరులు హాజరై సందడి చేశారు. ఇదిలావుంటే ఈ వేడుకలో యాంకర్ సుమను ముద్దు పెట్టుకున్నాడు హాలీవుడ్ నటుడు డానియెల్ కల్టగిరోన్. డానియెల్ కల్టగిరోన్ తంగలాన్ సినిమాలో విలన్ పాత్రలో నటిస్తున్నాడు. అయితే డానియెల్ వేదిక మీదకి వచ్చి సినిమా గురించి చెప్పిన అనంతరం కిందకి వెళుతూ.. సుమ చేయిపై ముద్దు పెట్టుకున్నాడు. దీంతో సడన్‌గా షాక్ తిని వెంటనే తెరుకున్న సుమ ఈ ఘటనను స్పోర్టివ్‌నెస్‌గా తీసుకుంది. ఓరి నాయనో.. రాజా, ఈయన మా అన్నయ్య.. రాఖీ పండగ వస్తోంది అంటూ కవర్ చేసి.. అన్నయ్య సన్నిధి.. అని పాట పాడింది. దీంతో అక్కడ ఉన్న అభిమానులంతా ఒక్కసారిగా అరుపులు కేకలు వేయగా.. ఈవెంట్ అంతా సంబరంగా మారింది. అయితే ఈ ఘటనలో సుమ ఖచ్చితంగా ఇబ్బంది పడింది.. ఇది ఆమె ఫేస్ చూస్తే అర్ధమవుతుంది. కానీ ఈవెంట్‌కి ఇబ్బంది కలగకూడదని సుమ కవర్ చేసింది. అయితే ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# మీనాక్షి చౌదరి నవ్వుతో.. కుర్రాళ్ల మతిపోగొడుతుంది

**విశ్వంభర, సినిమా :** హీరోయిన్ మీనాక్షి చౌదరి తొలి సినిమాలో నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చిన్నది. ఆతర్వాత మాస్ రాజా రవితేజ హీరోగా నటించిన ఖిలాడీ సినిమాలో తన అందంతో కవ్వించింది. ప్రస్తుతం ఈ బ్యూటీ వరుసగా ఆఫర్స్ తో ఫుల్ బిజీగా మారిపోయింది. 'హిట్ 2', మహేష్ బాబు సరసన గుంటురు కారం సినిమాలో చేసింది. ఆతర్వాత ఇప్పుడు వరుణ్ తేజ్ మట్కా సినిమాలో నటిస్తుంది. అలాగే విశ్వక్ సేన్ హీరోగా చేస్తోన్న మెకానిక్ రామ్ అనే సినిమాలో నటిస్తుంది. వీటితో పాటు దుల్కర్ సల్మాన్ హీరోగా చేస్తోన్న లక్కీ భాస్కర్ అనేలో నటిస్తుంది. ప్రస్తుతం తమిళ స్టార్ హీరో విజయ్ దళపతితో కలిసి 'ది గోట్' అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాకు వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. సెప్టెంబర్ 5న ఈ పొలిటికల్ థ్రిల్లర్ విడుదల కానుంది. ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ చీరలో చిరునవ్వులు చిందించే ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు కుర్రకారు బాగా ఆకట్టుకుంటున్నాయి.

## కన్నప్ప మూవీ నుంచి దేవరాజ్ లుక్ రిలీజ్

**విశ్వంభర, సినిమా :** డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి ప్రతి సోమవారం ఒక అప్ డేట్ వస్తోంది. ఈ చిత్రంలో నటించిన ఆర్టిస్టులందరి లుక్‌ను ఒక్కొక్కటిగా రివీల్ చేస్తూ అంచనాలు పెంచేస్తున్నారు. ఇప్పటికే 'కన్నప్ప'గా విష్ణు మంచు లుక్ అందరినీ ఆకట్టుకుంది. నాథనాధుడిగా శరత్ కుమార్, చెంచు తెగ నాయకురాలు పన్నాగ పాత్రలో మధుబాల లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇక ప్రస్తుతం దేవరాజ్ పాత్రకు సంబంధించిన లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో దేవరాజ్ ఎరుకల తెగకు నాయకుడిగా కనిపించనున్నారు. ఎరుకల తెగ నాయకుడైన 'ముండడు' అనే పాత్రలో దేవరాజ్ అద్భుతమైన లుక్‌లో కనిపించనున్నారు. ఈ మేరకు రిలీజ్ చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. కన్నప్ప చిత్రంలో దిగ్గజ నటులున్నారన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌లో డా.మోహన్ బాబు, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్, ప్రభాస్, బ్రహ్మానందం, మధుబాల వంటి వారు నటిస్తున్నారు. ఇప్పటికే కన్నప్ప వరల్డ్‌ని పరిచయం చేసి జనాల్లో హైప్ పెంచేశారు. 'కన్నప్ప' విజువల్ వండర్‌గా ఇండియన్ స్క్రీన్ మీద ఆకట్టుకోబోతోంది.

# జాన్వీ రొమాంటిక్ ట్రీట్ అదుర్స్

**విశ్వంభర, సినిమా :** ఎన్టీఆర్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న దేవర సెకండ్ సింగ్ సాంగ్ ఎట్టకేలకు విడుదల అయింది. 'చుట్టమల్లె చుట్టేస్తాంది తుంటరి చూపు.. ఊరికే ఉండదు కాసేపు.. అస్తమానం నీ లోకమే నా మైమరపు.. చేతనైతే నువ్వే నన్ను ఆపు' అని సాగే ఈ పాటలో ముఖ్యంగా జూనియర్ ఎన్టీఆర్, జాన్వీకపూర్‌లు పూర్తిగా రొమాంటిక్ మూడ్‌లోకి తీసుకెళ్లారు. తొలిసాంగ్ విధ్వంసాన్ని చూపించింది. మొదటి పాటతోనే సినిమాలో ఏ రేంజ్ లో రక్తపాతం ఉంటుందో క్లారిటీ వచ్చేసింది. రెండో సాంగ్ రొమాన్స్‌ని పరిచయం చేసింది. ముఖ్యంగా ఇందులో జాన్వీకపూర్ అందాలు అభిమానులకు అదిరిపోయే ట్రీట్ అనే చెప్పాలి. ఈ మూవీలో ఎన్టీఆర్, జాన్వీ ల మధ్య కెమిస్ట్రీ నెక్ట్స్ లెవెల్ ఉండబోతున్నట్టు ఈ సాంగ్ లో స్పష్టంగా అర్థమవుతోంది. దీంతో ఆడియెన్స్‌లో ఈ సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్, ఫియర్ సాంగ్ సినీ లవర్స్‌లె మాములు అంచనాలు క్రియేట్ చేయలేవు. కేవలం నందమూరి ఫ్యాన్స్ మాత్రమే కాదు యావత్ తెలుగు ప్రేక్షకులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్న మూవీ 'దేవర'. కొరటాల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై ఆడియెన్స్‌లో ఉన్న అంచనాలు అన్నీ ఇన్నీ కావు. రెండు భాగాలుగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. తొలి భాగానికి సంబంధించిన షూటింగ్ ఇప్పటికే పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఇక మొదటి పార్టు సెప్టెంబర్ ఆకరులో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. ఈ పాటకి రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ ఫ్రెష్‌గా అనిపించింది. సంగీత దర్శకుడు అనిరుద్ రవిచందర్ ఈ పాటను మెలోడియస్ ట్యూన్‌ను కంపోజ్ చేశాడు. సింగర్ శిల్పారావు ఈ సాంగ్ చాలా అద్భుతంగా పాడారు. అలాగా ఎన్టీఆర్ లుక్స్ స్టైలిష్‌గా ఉన్నారు. ఇక జాన్వీ అందాలు కురాళ్ల మదిని దోచేశాయి. ఈ పాటతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. రాజమౌళితో సినిమా చేసిన తర్వాత.. ఏ హీరో కూడా ఇప్పటి వరకు వెంటనే హిట్టు కొట్టలేదు. ఇప్పుడా సెంటిమెంట్‌ను ఎన్టీఆర్ దేవరతో బ్రేక్ చేస్తాడని స్పష్టంగా తెలుస్తుంది. కొరటాల శివ ఈ సినిమాను బ్లాక్‌బస్టర్ చేయాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ సినిమాలో యంగ్‌టైగర్ సముద్రం అవతల ఉండే పది ఊర్లను కాపలా కాచేవాడిలా తారక్ కనిపించబోతున్నాడు. బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నాడు.



# మొక్కలు నాటండి.. టికెట్లు పట్టండి

**విశ్వంభర, సినిమా :** టాలీవుడ్ బుల్లితెరపై స్టార్ యాంకర్ గా చెలామణీ అయిన అనసూయ భరద్వాజ్ ఇప్పుడు వెండితెరపై వెలిగిపోతోంది. వరుసగా సినిమాలు చేస్తూ ఆడియెన్స్ ను అలరిస్తోంది. గతేడాది విమానం, ప్రేమ విమానం వంటి ఫీల్ గుడ్ సినిమాలతో హిట్స్ కొట్టిన అనసూయ ఈ ఏడాది రజాకార్ సినిమాతో ఆడియెన్స్ ను పలకరించింది. ఇప్పుడు 'సింబా' అంటూ మరో ఇంట్రెస్టింగ్ మూవీతో మన ముందుకు వస్తోంది. సంపత్ నంది టీం వర్క్స్, రాజ్ దాసరి ప్రొడక్షన్స్ బ్యానర్ల పై సంపత్ నంది, దాసరి రాజేందర్ రెడ్డి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మురళీ మనోహర్ దర్శకత్వం వహించారు. అనసూయతో పాటు కబీర్, శ్రీనాథ్ మాగంటి, వశిష్ట, దివి తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగస్టు 09న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా సింబా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను గ్రాండ్ గా నిర్వహించారు. అనసూయతో సహా చిత్ర బృందమంతా ఈ కార్యక్రమంలో పాల్గొంది. ఈ సందర్భంగా మాట్లాడిన మేకర్స్ మూవీ లవర్స్ కు ఒక బంపరాఫర్ ప్రకటించారు. మొక్కలను నాటి సోషల్ మీడియాలో ఫొటోలు పంపితే.. ఈ సినిమా టికెట్లు ఉచితంగా ఇస్తానంటూ వెల్లడించారు. మొక్కలు నాటిన ఫొటోలు పంపిన వారందరికీ ఈ ఆఫర్ వర్తిసుందని స్పష్టం చేశారు. ప్రముఖ నటుడు శ్రీనాథ్ మాగంటి మాట్లాడుతూ.. ' వృక్షో రక్షిత రక్షిత: అనే కాన్సెప్ట్‌తో సింబా మూవీ తెరకెక్కింది. ఇలాంటి చిత్రాలు అరుదుగా వస్తాయని, అందరూ చూడాలి' అని కోరాడు. ఇదే సందర్భంగా ఈ సినిమా నిర్మాత, ప్రముఖ దర్శకుడు సంపత్ నంది మాట్లాడుతూ.. ' సింబా మూవీ ప్రారంభం కావడానికి ప్రధాన కారణం ఉదయ భాను. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఉదయభాను నన్ను ఛాలెంజ్ చేసింది. ఆ తరువాత సంతోష్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన హరితహారం గురించి తెలుసుకున్నా. అలాంటి టైంలోనే ఈ కథ విన్నాను. అందరికీ కనువిప్పు కలిగేలా, ఎంటర్టైన్ చేసేలా, మంచి సందేశం ఇచ్చేలా సింబా ఉంటుంది. ఈ చిత్రం ఆగస్ట్ 9న రాబోతోంది. ఏ ఒక్కర్నీ నిరాశపర్చదు. అందరినీ మెప్పిస్తుంది' అని చెప్పుకొచ్చారు. కాగా గతంలోనే మొక్కలు నాటాలని, చెట్లను పెంచాలంటూ చిత్రం యూనిట్ అందరినీ రిక్వెస్ట్ చేసింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి మొక్కలు నాటితే తమ సినిమా టికెట్లు ఫ్రీగా ఇస్తామని ప్రకటించింది.



# డ్రై ఫ్రూట్స్‌లో పోషకాలు మెండు



**విశ్వంభర, ఫీచర్ :** ఇప్పుడంతా హైటెక్ కాలం.. శరీరానికి కావాల్సిన శక్తిని సహజంగా కాకుండా వివిధ రూపాల్లో పొందుతున్న కాలం.. ఇలాంటివే డ్రై ఫ్రూట్స్. అన్ని వయసుల వారికీ ఏదో ఒక డ్రై ఫ్రూట్ ను సూచిస్తుంటారు ఆరోగ్య నిపుణులు. అయితే, డ్రై ఫ్రూట్ లలో కాస్త ఖరీదైనది పిస్తా. బాదం పప్పులు, జీడిపప్పుల కంటే పిస్తా రేటు అధికమే. అందులోనూ బాదం, జీడి పప్పుల్లా అవి అన్నిచోట్లా కూడా దొరకవు. కానీ, రుచి మాత్రం ఆ రెండింటి కంటే మెరుగే. అందుకే పిల్లలు పెద్దలు ఇష్టంగా తింటారు. పోషకాలు మెండు.. డ్రై ఫ్రూట్ లలో రారాజుగా పేర్కొనే పిస్తాను రోజూ ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక లాభాలున్నాయనేది నిపుణుల మాట. అందులోనూ చలికాలంలో మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని అంటున్నారు. పిస్తా అనేది వేడి స్వభావం కలిగినది. శీతాకాలంలో శరీరం లోపలి నుంచి వెచ్చగా ఉంచడంలో తోడ్పడుతుంది. ఎలాగూ ఆరోగ్యానికి ఉపయోగకరమైనదే కాబట్టి.. శీతాకాలపు సరైన చిరుతిండిగా పరిగణిస్తున్నారు. సాధారణ వ్యాధులను అడ్డుకుంటుందట రోజూ కొన్ని పిస్తా పప్పులను తినడం వల్ల సాధారణ వ్యాధులైన జలుబు, దగ్గు నుంచి తప్పించుకోవచ్చనేది ఆరోగ్య నిపుణుల మాట. ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు, మినరల్స్ దండిగా ఉండే పిస్తా శక్తిని అందిస్తుంది. విటమిన్ ఇ దీని ద్వారా లభిస్తుంది. స్థితిస్థాపకతను పెంచుతూ చర్మాన్ని రక్షిస్తుంది. అంటే.. ముడతలు, గీతలను నివారిస్తుంది. అతి నీలలోహిత కిరణాల నుంచి రక్షిస్తుంది.. చర్మం పొడిబారకుండా.. తేమను కలిగి ఉండేలా చేస్తుంది. పిస్తాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. అంటే.. వ్యాధులను దరిచేరకుండా చూస్తుంది. పిస్తా శరీరంలోని చెడు కొవ్వు (కొలెస్ట్రాల్)ను తగ్గిస్తుందని.. మంచి కొవ్వును పెంచుతుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. మంచి కొలెస్ట్రాల్ గుండె పనితీరులో కీలకం. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా కాపాడేందుకు పిస్తా సాయపడుతుందని వివరిస్తున్నారు. పిస్తాలు తినడం ద్వారా ఎక్కువసేపు ఆకలి కలగదు. ఎక్కువ తినకపోవడం ఊబకాయాన్ని నివారిస్తుంది. హైపర్ టెన్షన్, మధుమేహం, గుండె వ్యాధులు రావు. పిస్తాల్లో బయోటిన్ పుష్కలంగా ఉంటుంది. బయోటిన్ జుట్టుకు చాలా మేలు. దీనిలోపం కారణంగానే జుట్టు రాలడం, చుండ్రు, పొడిబారడం వంటి అనేక సమస్యలు వస్తాయి.

# కరివేపాకే అని తీసి పారేయకండి!

**విశ్వంభర, ఫీచర్ :** మనం నిత్యం కూరలలో కరివేపాకుని వాడుతూ ఉంటాం. అయితే భోజనం చేసేటప్పుడు చాలామంది కరివేపాకును తీసి పక్కన పెడుతూ ఉంటారు. కరివేపాకును అస్సలు తినరు. అయితే కరివేపాకు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వాళ్లకు తెలియక తీసి పక్కన పడేస్తూ ఉంటారు కరివేపాకు యొక్క ఆరోగ్య ప్రయోజనాలు తెలిసినవారు దానిని అస్సలు తినకుండా వదిలిపెట్టరు. మరి ఇంతకీ కరివేపాకు ఆరోగ్య ప్రయోజనాలు ఏంటి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. కరివేపాకు ఎక్కువగా ఇండియాలో పండుతుంది. కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు, వివిధ రకాల ఔషధ గుణాలు ఉంటాయి. కరివేపాకులో విటమిన్ సి ఉంటుంది. కరివేపాకులో యాంటీ కార్సినోజెనిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ డయాబెటిక్, హిపటో ప్రొటెక్టివ్స్ ఎక్కువగా ఉంటాయి. కరివేపాకులో నికోటిన్ ఆమ్లం తో పాటు విటమిన్ ఏ, విటమిన్ బి, విటమిన్ ఈ, ప్లాస్టిస్టెరాల్స్ ,అమైనో ఆమ్లాలు, గ్లైకోసైడ్లు, ఫ్లేవనాయిడ్లు ఉంటాయి. ఇక కరివేపాకుతో మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఒనగూరుతాయి. కరివేపాకుని మన ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ప్రతిరోజు తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. కరివేపాకులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తాన్ని శుభ్రం చేస్తాయి. కరివేపాకు కంటి చూపును మెరుగుపరుస్తుంది. జుట్టుకు ఆరోగ్యాన్ని ఇస్తుంది. కరివేపాకు తీసుకోవడం వల్ల ఆహారం బాగా జీర్ణం అవుతుంది. జీర్ణ సమస్యలు తగ్గుతాయి. చర్మ సంరక్షణకు ఉపయోగపడుతుంది. శరీరంలోని బ్యాడ్ కొలెస్ట్రాల్ ను తగ్గించి కరివేపాకు బరువు తగ్గేందుకు ఉపయోగపడుతుంది. మధుమేహాన్ని బాగా తగ్గిస్తుంది. కరివేపాకు గ్యాస్ట్రో సమస్యలను తగ్గిస్తుంది. పలు రకాల క్యాన్సర్ల నివారణకు కరివేపాకు పనిచేస్తుంది. కరివేపాకు ఎముకల అరుగుదలను, అతిసారం వంటి వ్యాధులను నివారిస్తుంది. జీర్ణ సమస్యలకు కరివేపాకు దివ్య ఔషధం. బ్యాక్టీరియా మరియు ఫంగల్ ఇన్ఫెక్షన్ లతో కరివేపాకు పోరాడుతుంది. హెపటైటిస్ , సిర్రోసిస్ వంటి వ్యాధుల నుంచి కాలేయాన్ని కరివేపాకు రక్షిస్తుంది. కాబట్టి కరివేపాకే కదా అని తీసి పక్కన పెట్టకుండా ఖచ్చితంగా ప్రతి ఒక్కరు కరివేపాకును ఆహారంలో భాగంగా చేసుకోండి. భోజనం చేసేటప్పుడు పొరపాటున కూడా తీసి పారేయకండి.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com